www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 60 | బుధవారం | 7 అక్టోబర్, 2026

6

అమెరికాలో మళ్లీ మీజిల్స్ కలకలం

25 ఏళ్ల మోదీ నాయకత్వానికి

కేంద్ర కేబినెట్ ప్రశంస

- 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' విధానంతో పాలన
- ఐటీ, మౌలిక వసతుల రంగాల్లో కీలక నిర్ణయాలు.. రూ.10 వేల కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌కు ఆమోదం

2

45 ఎకరాల లెక్క తేల్చాలి

వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలి

- గుర్తించిన భూమిని అర్హులైన రైతులకు పంపిణీ చేయాలి
- జూన్ 2లోగా అమరవీరుల కాలనీ పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ఆచూకీ లభించని 45 ఎకరాల భూమిని గుర్తించేందుకు వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 22–ఏ భూముల అంశంపై గత నెల 16న శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం ఆదేశించిన విచారణ పురోగతిపై మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోదీ పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు.

ప్రజానావ, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ఆచూకీ లభించని 45 ఎకరాల భూమిని గుర్తించే ందుకు వెంటనే సర్వే నోటిఫికేషన్ జారీ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారుల ను ఆదేశించారు. 22–ఏ భూముల అంశంపై గత నెల 16న శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం ఆదేశించిన విచారణ పురోగతిపై మంగళవా రం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోదీ పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ ఆక్రమాలపై విచారణకు ఏర్పాటు చేసిన కమిటీ, ధరణి ఆక్రమాలపై విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విచారణ పురోగతిని కమిటీ సభ్యులు సీఎంకు వివరించారు.

రికార్డుల్లో 388 ఎకరాలు..

ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే తాజా సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించామని వివరించా రు. రికార్డుల్లో నమోదైన భూమికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉన్నట్లు వెల్లడించారు. దీంతో ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి 45 ఎకరాల భూమి ఆచూకీ తేల్చేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం ఆదేశించారు. సర్వే నంబర్ 325 సమీపంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున.. వాటికి సంబంధించిన రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. సర్వేలో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాలకు కాలనీ

తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ' నిర్మించాలని సీఎం సూచించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతల ను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వెలికట్టలో ఎడ్యుకేషన్ హబ్

కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములను మినహాయించి మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటిని జాగ్రత్తగా వినియోగించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మల్లన్నసాగర్ నీటిని అనధికారికంగా వినియోగిస్తున్న వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

2

కాంక్రీట్‌తో గుడి కడుతూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నారు

- రాజన్న ఆలయాన్ని కృష్ణ శిలలతో ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మించాలి
- రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ హిట్ జోడీ కాదు.. ఇడుపు కాయితం జోడీ
- నవంబర్ వరకు రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వాల్సిందే
- సిరిసిల్ల సెస్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలి
- నేరేళ్ల బాధితుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాళ్లను మళ్లీ మోసం చేశారు
- వారికి న్యాయం జరిగే వరకు మా పోరాటాన్ని ఆపేది లేదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

అమరులు కోరుకున్న సమాజాన్ని నిర్మించాలి

- సబ్బండ వర్గాలకు అధికారంలో వాటా దక్కాలి.. అప్పుడే అమరుల త్యాగాలకు ఫలితం దక్కుతుంది
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2

భూత కణాల అన్వేషకుడికి నోబెల్

- భౌతికశాస్త్రంలో ఆస్ట్రోఫిజికల్ న్యూట్రినోల గుర్తింపునకు పురస్కారం
- ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీలో కీలక పాత్ర పోషించిన ఫ్రాన్సిస్ హాల్జెన్

6

2

వైమానిక దళానికి కొత్త చీఫ్‌గా

అశుతోష్ దీక్షిత్

- అక్టోబర్ 31న బాధ్యతల స్వీకరణ
- 2028 డిసెంబరు 31 వరకు కొనసాగనున్న ఎయిర్ మార్షల్



2

ఏ పార్టీ భేటీకి సమయం కోరలేదు

- అధికారిక ప్రతినిధి ద్వారా ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి
- 240 మంది ఎంపీలతో పార్లమెంట్ అనెక్స్‌లో భేటీ ప్రతిపాదన అసాధారణం
- వినతిపత్రం స్వీకరణకు సీనియర్ అధికారిని పంపుతాం: సీఈసీ
- రాహుల్ ధర్నాపై కేంద్రం ఎన్నికల సంఘం ప్రకటన

6

2

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు

నరేంద్ర మోడీ, అమిత్ షా, భగవత్, సీఈసీ

- 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారు.. ఇది దేశద్రోహమే
- ఎంపీలను కలవడానికి ఈసీకి అభ్యంతరం ఏమిటి?
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

6

నరేంద్ర మోడీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశమొత్తానికి తెలుసు. కానీ మేం రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్నాం. కొద్దిసేపటి క్రితం దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లను కలవడానికి నిర్వచన్ సదన్(ఎన్నికల ప్రధాన కార్యాలయం) వైపు వెళ్లాం. అయితే, ఈసీ కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలో పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. నాకు అర్థం కాని విషయం ఏంటంటే, కోట్లాది మంది ప్రజలు ఓట్లేసి గెలిపించిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి ఉన్న అభ్యంతరం ఏంటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికే సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఏంటి?

– రాహుల్ గాంధీ

2

అసత్య ప్రచారం రాహుల్‌కి అలవాటైంది

- ప్రతిపక్ష నేతకురాజ్యాంగ సంస్థలపై నిరాధార ఆరోపణలు
- ఈసీపై ఆరోపణలతో ప్రజల్లో అనుమానాలు రేకెత్తించే ప్రయత్నం
- ఫారం–6పై దుష్ప్రచారం: కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

2

అర్హులైన సింగరేణి కార్మికులకు

ఇళ్ల స్థలాల పట్టాలు

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

- 1,250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం పట్టాల పంపిణీ
- నెలలోపు ఆక్రమణదారుల ప్రాథమిక జాబితా
- 15 రోజుల్లో 300 డిపెండెంట్ ఉద్యోగాల ఉత్తర్వులు
- ఏరియా ఆసుపత్రుల్లోనే మెడికల్ బోర్డులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

రాజ్యాంగాన్ని అపహాస్యం చేయకండి రాహుల్!

- తెలంగాణలో అప్రజాస్వామిక పాలనపై స్పందించాలి
- ఆధారాలతో ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతను జైలుకు పంపుతున్నారు
- 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేతకు కేటీఆర్ పోస్ట్

2

ప్రజల నెత్తిన కరెంటు ఛార్జీల భారమా?

- వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- పెద్దుత్తున ప్రజాఉద్యమానికి శ్రీకారం
- మాజీ మంత్రి హరీశ్ రావు

2

అమరులు కోరుకున్న సమాజాన్ని నిర్మించాలి

ప్రజానావ, చందుర్తి/వేములవాడ: అమరులు కోరుకున్న సమాజాన్ని నిర్మించడమే వారికి మనమిచ్చే సరైన నివాళి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. చందుర్తి మండలం సనుగులలో మంగళవారం నిర్వహించిన అమరుల యాది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సబ్బండ వర్గాలు, కులాలకు అధికారంలో భాగస్వామ్యం దక్కినప్పుడే అమరుల త్యాగాలకు ఫలితం ఉంటుందన్నారు. సమాజం కోసం ఓ వ్యక్తి తన ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటం చేస్తుంటే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ నిమ్స్ లో 11 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు కుటుంబ సభ్యులుగా ఎంత నరకయాతన అనుభవించామో తనకు మాత్రమే తెలుసన్నారు. కేసీఆర్ తో ఇప్పుడు రాజకీయంగా విబేదించినా, దారులు వేరైనా సమాజం కోసం ఆయన చేసిన త్యాగాన్ని మాత్రం మర్చిపోవద్దన్నారు. అదే విధంగా తెలంగాణ కోసం అమరులైన వారిని, మంచి సమాజం కోసం అప్పట్లో ఈ ప్రాంతంలో అసువులు బాసిన మావోయిస్టులను గుర్తు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. వారు ఆకాంక్షించిన సమాజాన్ని నిర్మించాల్సి ఉందని చెప్పారు. అమరుల త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఆ ఫలాలు నిజంగా అందరికీ దక్కాయా అన్నది సమీక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటికీ పేదవాళ్లు మెరుగైన విద్య, వైద్యం కోసం పోరాడుతునే ఉన్నారని.. ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ అని ప్రశ్నించారు. ఆనాడు భూస్వాములు, దొరలపై పోరాడితే.. ఇప్పుడు అధికారం అడ్డం పెట్టుకొని దోచుకుంటున్న వాళ్లపై పోరాటం చేస్తున్నామన్నారు. దోపిడీ విధానం మారిందే తప్ప వారిలో ఆ స్వభావం మారలేదని.. అది మారాలంటే నిరంతరం పోరాటం చేయాలన్నారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి వస్తేనే పరిస్థితి మారుతుందన్నారు. మాజీ మావోయిస్టులు, అమర వీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా తాము పోరాటం చేస్తామన్నారు.

కాంక్రీట్‌తో గుడి కడుతూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నారు

ప్రజానావ, వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయాన్ని కాంక్రీట్‌తో నిర్మించడం ద్వారా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆలయ నిర్మాణం ఆలస్యమైనా ఫర్వాలేదని, ఆగమశాస్త్రం ప్రకారం కృష్ణశిలలతో వెయ్యేళ్లపాటు నిలిచేలా నిర్మించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన ఆమె.. వేములవాడ (శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.కోడె మొక్కులకు ప్రసిద్ధి చెందిన వేములవాడ ఆలయంలో కోడెల సంరక్షణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కవిత విమర్శించారు. కోడెలు మృత్యువాత పడుతున్నా సరైన పశుగ్రాసం అందించడం లేదని ఆరోపించారు. చనిపోయిన కోడెలకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు కూడా నిర్వహించడం లేదన్నారు. హిందుత్వం గురించి మాట్లాడే కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రసాద్ పథకంలో దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ ఆలయాన్ని చేర్చేందుకు కేంద్ర మంత్రి ఎందుకు కృషి చేయలేదని నిలదీశారు. రాజన్న ఆలయానికి కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు.వేములవాడకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నా మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని కవిత అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సూచించారు. తన తల్లిదండ్రుల వివాహం వేములవాడలోనే జరిగిందని, ఈ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.సిరిసిల్ల ప్రాంతానికి సాగునీరు అందించాలికాళేశ్వరం ప్రాజెక్టుతో సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావించినా.. ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదని కవిత ఆరోపించారు. రుద్రంగిలో 2018లో శంకుస్థాపన చేసిన

రిజర్వాయర్ పనులు ఇన్నేళ్లయినా పూర్తి కాలేదన్నారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే 63 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.దూంపేట వద్ద రిజర్వాయర్ నిర్మించి నీటిని ఎత్తిపోస్తే కథలాపూర్, మేడిపల్లి ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎర్రకుంట, పటేల్ చెరువులను అనుసంధానించి రిజర్వాయర్ నిర్మిస్తే వేములవాడ, చందుర్తి, కోనరావుపేట మండలాలకు నీరు అందించే అవకాశం ఉందన్నారు. మిడ్‌మానేరు, అప్పర్ మానేరు లింక్ పనులను పూర్తి చేస్తే లక్షా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.సెస్ అవినీతిపై విచారణ జరపాలిసిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)లో జరిగినట్లు ఆరోపిస్తున్న రూ.32 కోట్ల అవినీతిపై ప్రభుత్వం విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయని, అలాంటప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సెస్‌లో అగ్నిప్రమాదం జరగడం, ఫైళ్లు దగ్ధమయ్యాయని చెప్పడం వెనుక అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం ఉందని ఆరోపించారు.సహకార విద్యుత్ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా ఉన్న సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. నేతన్నలు, చేనేత కార్మికులు అధికంగా ఉన్న సిరిసిల్లలో యార్న్ డిపో ఏర్పాటు చేయకుండా వేములవాడలో ఏర్పాటు చేయడం రాజకీయ దర్పాన్ని ప్రదర్శించడమేనన్నారు.సిరిసిల్లలో జేఎన్‌టీయూ ఏర్పాటైనా ల్యాబ్ సౌకర్యాల కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కవిత విమర్శించారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు హాస్టల్‌లో కనీస వసతులు లేవని, ఒక్కో గదిలో 16 మంది ఉంటున్నారని ఆరోపించారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీ కూడా పనిచేయడం లేదన్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన 112 మంది కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లకు రైలు సౌకర్యం కల్పించాలన్న దశాబ్దాల డిమాండ్ సాధన కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. మంజూరైన 15 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి పనులను పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలని కోరారు.'

హిట్ జోడీ కాదు.. ఇడుపు కాగితం జోడీ'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఉద్దేశించి కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారిద్దరినీ 'హిట్ జోడీ'గా అభివర్ణిస్తున్నారని, వాస్తవానికి అది 'ఇడుపు కాగితం జోడీ' అని ఎద్దేవా చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ ఒకలా మాట్లాడుతుంటే, రేవంత్‌రెడ్డి మరోలా మాట్లాడుతున్నారని.. అలాంటప్పుడు వారిని హిట్ జోడీ ఎలా అంటారని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత అన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న కోటి 10 లక్షల ఎకరాల పంటలను కాపాడాలంటే నవంబరు వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యుత్‌ను అదుక్కొచ్చినా, కొనుక్కొచ్చినా రైతులకు సరఫరా చేయాల్సిందేనన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పార్టీలకు అతీతంగా రైతుల తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం ప్రతి అంశానికీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలోనూ ప్రభుత్వం హామీ నెరవేర్చలేదన్నారు.

ఉర్దూ పత్రికలకు మండలానికి ఒక్కరికే అక్రిడిటేషన్ ఇస్తామనడం సరికాదని, ఉర్దూ భాషపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు.నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటంనేరెళ్ల బాధితుల పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. వారిని మరోసారి మోసం చేశారని కవిత ఆరోపించారు. సిరిసిల్ల సభలో న్యాయం చేస్తారని ఆశించిన బాధితులకు రూ.5 లక్షలు, రూ.10 లక్షల చొప్పున చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బాధితులను వర్గాలుగా విభజించి పరిహారంలో వ్యత్యాసం చూపడం అన్యాయమన్నారు. నేరెళ్ల బాధితులు తనను కలిసి ముఖ్యమంత్రి హామీలతో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారని తెలిపారు. కేసులకు సంబంధించిన ఆధారాలు మాయం చేశారని ఆరోపించిన ఆమె.. అప్పటి జైలర్, డీఐజీ బాధితులపై నిర్వహించిన విచారణ నివేదికలు ఏమయ్యాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సిరిసిల్ల ఎస్పీ శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం, మూడు ఎకరాల భూమి, కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రధాన పార్టీలకు దీటుగా తెలంగాణ రక్షణ సేన ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుందని తెలిపారు.

ఏ పార్టీ భేటీకి సమయం కోరలేదు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు దిల్లీలో నిర్వహించిన నిరసనపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నికల సంఘంతో భేటీకి సమయం కోరలేదని స్పష్టం చేసింది. ఈసీని కలవాలంటే సంబంధిత పార్టీ అధికారిక ప్రతినిధి ముందుగా అపాయింట్‌మెంట్ కోరాలని తెలిపింది. భేటీ తేదీ, సమయాన్ని ఇరు పక్షాల పరస్పర అంగీకారంతో ఖరారు చేయడం గతేడాది నుంచి అమల్లో ఉన్న విధానమని ఈసీ పేర్కొంది. రాజకీయ పార్టీలు తమను ఎప్పుడైనా కలవాలని కోరవచ్చని, అయితే అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి భేటీ తేదీ, సమయాన్ని నిర్ణయిస్తామని వెల్లడించింది.

ఎంపీల ప్రతిపాదనపై ఈసీ అభ్యంతరం

240 మంది ఎంపీలతో పార్లమెంట్ అనెక్స్‌లో భేటీ నిర్వహించాలంటూ కాంగ్రెస్ నుంచి ప్రతిపాదన వచ్చినట్లు ఈసీ తెలిపింది. ఇలాంటి ప్రతిపాదన అసాధారణమైనదని పేర్కొంది. ఎంపీలు సమర్పించే వినతిపత్రాన్ని స్వీకరించేందుకు సీనియర్ అధికారిని పంపుతామని స్పష్టం చేసినప్పటికీ.. ఆ ప్రతిపాదనను ఎంపీలు తిరస్కరించినట్లు వెల్లడించింది.భేటీ కోసం ముందస్తుగా అధికారికంగా సమయం కోరితే, తమ సౌకర్యాన్ని బట్టి తేదీ, సమయాన్ని ఖరారు చేస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. రాహుల్‌గాంధీ, ఇతర విపక్ష ఎంపీల నిరసన నేపథ్యంలో ఈసీ ఈ వివరణ విడుదల చేసింది.

'భూత కణాల' అన్వేషకుడికి నోబెల్

స్టాక్‌హోమ్: భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం బెల్జియన్–అమెరికన్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు దక్కింది. ఖగోళ మూలం కలిగిన అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోల ఆవిష్కరణతో పాటు ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ అభివృద్ధిలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. న్యూట్రినోలను సాధారణంగా 'భూత కణాలు'గా అభివర్ణిస్తారు. విద్యుదావేశం లేకపోవడం తోపాటు ఇతర పదార్థాలతో చాలా అరుదుగా మాత్రమే చర్య జరపడం వల్ల వీటిని గుర్తించడం అత్యంత క్లిష్టం. మన చుట్టూ నిరంతరం ప్రయాణిస్తున్నప్పటికీ.. వాటి ఉనికిని గుర్తించడం శాస్త్రవేత్తలకు సవాలుగా నిలుస్తోంది. ఈ కణాలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించే విధానాన్ని అభివృద్ధి చేయడంలో హాల్జెన్ కీలక పాత్ర పోషించారు. మంచులో ఏర్పాటు చేసిన కాంతి సెన్సార్ల సాయంతో న్యూట్రినోల జాడలను గుర్తించే ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఈ పరిశోధన ద్వారా విశ్వంలోని అత్యంత శక్తిమంతమైన ఖగోళ ఘటనలపై అవగాహనకు కొత్త మార్గాలు తెరుచుకున్నాయి.

వరుసగా నోబెల్ ప్రకటనలు

నోబెల్ పురస్కారాల ప్రకటనలు కొనసాగనున్నాయి. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో పురస్కార గ్రహీతల పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటిస్తారు. అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ పురస్కారం నగదు బహుమతి 12 లక్షల డాలర్లు (సుమారు రూ.11.5 కోట్లు). స్వీడన్ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం 1901 నుంచి ఈ పురస్కారాలను అందిస్తున్నారు.

వైమానిక దళానికి కొత్త చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

న్యూఢిల్లీ: భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తదుపరి చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎయిర్ చీఫ్ మార్షల్‌గా సేవలందిస్తున్న అమర్‌ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం అశుతోష్ దీక్షిత్ 'చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్'గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన 2028 డిసెంబరు 31 వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.1966 డిసెంబరులో జన్మించిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబరులో భారత వైమానిక దళంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సర్వీసులో వివిధ కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా సేవలందిస్తున్నారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ తదితర కీలక సైనిక కార్యకలాపాల్లో ఆయన విధులు నిర్వహించారు. మిరాజ్–2000, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి పలు యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉంది. ఇప్పటివరకు 3,500 గంటలకు పైగా విమానయాన అనుభవాన్ని ఆయన సొంతం చేసుకున్నారు.

సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తుల ప్రమాణం

- **జస్టిస్ సునీతా అగర్వాల్, దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, అపరేశ్‌కుమార్ సింగ్ బాధ్యతల స్వీకారం**
- **న్యాయమూర్తుల సంఖ్య 37కి.. మహిళా జడ్జీల సంఖ్య మూడుకు**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ సునీతా అగర్వాల్, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ మంగళవారం పదవీ ప్రమాణం చేశారు. సాయంత్రం 3.30 గంటలకు సుప్రీంకోర్టు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వారికి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, వివిధ హైకోర్టుల అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, కొత్త న్యాయమూర్తుల కుటుంబసభ్యులు హాజరయ్యారు. ముగ్గురు కొత్త న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించడంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది. వీరిలో మహిళా న్యాయమూర్తులు ముగ్గురు ఉన్నారు.ఔ సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల గరిష్ఠ సంఖ్యను సీజేఐతో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ కేంద్ర కేబినెట్ ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా మే 16న ఆర్డినెన్స్ జారీ అయింది. అనంతరం జూన్ 2న ఒకేసారి ఐదుగురు న్యాయమూర్తులను సుప్రీంకోర్టుకు నియమించారు. తాజాగా మంగళవారం మరో ముగ్గురు న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించడంతో ఈ ఏడాది ఇప్పటివరకు సుప్రీంకోర్టులో ఎనిమిది మంది కొత్త జడ్జీల నియామకం పూర్తయింది. ఇదే సమయంలో నలుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. నవంబరు 29న జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ కూడా పదవీ విరమణ చేయనున్నారు.

ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నలుగురూ కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని, 'ఓటు చోరీ' కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ దేశద్రోహమేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం విపక్ష ఎంపీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వచన్ సదన్' వరకు దాదాపు 300 మంది ఎంపీలు ర్యాలీగా బయలుదేరారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఆకాశవాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో పోలీసులు భారీగా బలగాలను మోహరించి ర్యాలీని అడ్డుకున్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు విపక్ష ఎంపీలను ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో ఆకాశవాణి భవన్ కాంప్లెక్స్‌లోనే విపక్ష నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

'ఎంపీలను కలవడానికి ఈసీకి అభ్యంతరం ఏమిటి?'

ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ''మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశమంతటికీ తెలుసు. మేం మాత్రం రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం'' అని అన్నారు.''దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో కలిసి సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు నిర్వచన్ సదన్ వైపు వెళ్లాం. కానీ ఎన్నికల సంఘం కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలోనే పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. కోట్లాది మంది ప్రజలు ఓటు వేసి గెలిపించిన ఎంపీలతో మాట్లాడేందుకు ఈసీకి ఉన్న అభ్యంతరం ఏమిటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికి సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్యం పరిస్థితి ఏంటి?'' అని రాహుల్ ప్రశ్నించారు. విపక్షాల ర్యాలీని అడ్డుకునేందుకు సీఆర్‌పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ సహా భారీగా భద్రతా బలగాలను మోహరించారని సీపీఐ ఎంపీ పి.సందోష్‌కుమార్ అన్నారు. సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టం చేశారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని, ఎన్నికల సంఘం తీరుపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ర్యాలీని అడ్డుకున్న అనంతరం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విపక్షాలు వెల్లడించాయి.

ఎస్ఐఆర్, ఫారం–6 మార్పులపై దుమారం

ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తలపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఎస్ఐఆర్‌లో భాగంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో చేసిన మార్పులపైనా ప్రతిపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యవహారంపై ఇతర రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

పోలీసుల అదుపులో రాహుల్, ప్రియాంక

ఆకాశవాణి భవన్ వద్ద విపక్షాల నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, పవన్‌ఖేరా, అమరీందర్‌సింగ్‌తో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని విపక్ష నేతలు స్పష్టం చేశారు.

25 ఏళ్ల మోడీ నాయకత్వానికి కేంద్ర కేబినెట్ ప్రశంస

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా పాలనా ప్రస్థానాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ మంగళవారం తీర్మానం ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం.. పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో మోదీ ముందుకు సాగుతున్నారని పేర్కొంది.గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడు పర్యాయాలు పనిచేసిన మోదీ.. అక్కడ అనేక విజయవంతమైన కార్యక్రమాలను అమలు చేశారని కేబినెట్ తెలిపింది. గుజరాత్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పలు పథకాలను అమలు చేస్తూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని పేర్కొంది. ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారని గుర్తు చేసింది.

ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీకి ఆమోదం

ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రవాణా, మౌలిక వసతుల రంగాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణతో పాటు వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచడంలో ఐటీలా కీలకంగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల అమలులో సమన్వయ లోపాలను తగ్గించి పనులు వేగంగా పూర్తయ్యేలా ఈ సంస్థ దోహదపడుతుందని చెప్పారు.రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఐటీలా మదింపు చేస్తుందని వివరించారు.

ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్ల గ్రోత్ ఫండ్

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఈక్విటీ పెట్టుబడులు అందించేందుకు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ఎంఈలకు దీర్ఘకాలిక పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.దీంతో చిన్న, మధ్యతరహా సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈల పాత్రను మరింత బలోపేతం చేసేందుకు ఈ నిధి దోహదపడుతుందని కేంద్రం వెల్లడించింది.

అర్హులైన సింగరేణి కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాలు

ప్రజానావ, హైదరాబాద్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జీవో నంబర్ 76 ప్రకారం 1,250 ఎకరాల్లో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణి ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, సంస్థ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆయా ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను భట్టి సానుకూలంగా విని, వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక

యాసంగి సాగుపై ఎస్సారెస్పీ నీటి గుబులు

- ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షాలు
- 46.057 టీఎంసీలకే పరిమితమైన శ్రీరామసాగర్ నిల్వలు

ప్రజానావ, నిజామాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో శ్రీరామసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో ఈసారి ఆయకట్టు సాగుకు నీటి ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. పంట పొలాలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అన్నదాతలు సాగునీటి చుక్క కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కష్టకాలంలో అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కొన్ని తడులకే విడుదల.. శ్రీరామసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటిమట్టం నిలకడగా ఉన్నప్పటికీ, యాసంగి సాగుకు సరిపడా నిల్వలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఎగువ ప్రాంతాల నుంచి 42.398 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి చేరింది. వానాకాలం పంటలకు లక్ష్మి, సరస్వతి కాల్వల ద్వారా ఆలస్యంగా కొన్ని తడులకు నీటిని విడుదల చేశారు. అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలతోపాటు జలాశయంలో వెనుకకు నిలిచే నీటి ఒడ్డున ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలిస్తే యాసంగిలో ఆయకట్టుకు నీటి విడుదల కష్టంగానే కనిపిస్తోంది. యాసంగి పంటలకు నీరు విడుదల చేయాలంటే ప్రాజెక్టులో కనీసం 60 నుంచి 65 టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉండాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 46.057 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

తాగునీటి కోసం చెరువు నీటి తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

మాదన్నపేట పెద్ద చెరువు వద్ద రైతులు, స్థానికుల మధ్య వాగ్వాదం

తూము షెట్టర్ తాళం తీసుకెళ్లిన గ్రామస్థులు

ప్రజానావ, వరంగల్: నర్సంపేట మండలం మాదన్నపేట పెద్ద చెరువు నుంచి నీటిని తరలించే ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకోవడంతో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. చెరువు నుంచి కుమ్మరిగడ్డ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు రైతులు తూము తీసే ప్రయత్నం చేయగా మాదన్నపేట, నాగుర్లపల్లి గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం చెరువులో కేవలం నాలుగు అడుగుల మేర నీరు మాత్రమే ఉందని, ఈ నీరు తమ రెండు గ్రామాల తాగునీటి అవసరాలకు అత్యంత కీలకమని స్థానికులు తెలిపారు. ఇప్పటికే నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున చెరువు నీటిని తరలిస్తే తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని, నీటిని విడుదల చేయవద్దని రైతులను కోరారు. అయితే పంటలకు సాగునీరు అవసరమని పేర్కొంటూ రైతులు వెనక్కి తగ్గకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో తూము షెట్టర్ తాళాన్ని స్థానికులు తీసుకెళ్లారు. దీంతో రైతులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతోపాటు నీటిపారుదల శాఖ అధికారులను కలిసేందుకు వెళ్లారు. చెరువులో ఉన్న పరిమిత నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాలా, సాగునీటి కోసం విడుదల చేయాలా అనే అంశంపై ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తడంతో అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తేనే తనిఖీలా?

- హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లలో ఆహార భద్రత నిబంధనలకు తూట్లు
- ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

ప్రజానావ, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆహార భద్రతా నిబంధనల అమలుపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే సంబంధిత ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత, నాణ్యతకు కొందరు నిర్వాహకులు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. మిగిలిపోయిన మాంసం, కూరగాయలను ఫ్రిజ్‌లో నిల్వ చేసి మరుసటి రోజు వినియోగించడం, ఒకసారి వాడిన వంట నూనెను తిరిగి ఉపయోగించడం, ఆహార పదార్థాలకు కృత్రిమ రంగులు కలపడం వంటి చర్యలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ విభాగంలో సిబ్బంది కొరతతోపాటు ఇతర కారణాల వల్ల తనిఖీలపై తగినంత దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారిణికి ఇతర జిల్లాల బాధ్యతలు కూడా అప్పగించడంతో ఇక్కడ పర్యవేక్షణ బలహీనపడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించడం లేదనే ఆరోపణలు ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది కూడా అదే ధోరణిని అనుసరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా ఆహార నాణ్యతపై ఆరోపణలు వచ్చినప్పుడు నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపుతున్నప్పటికీ.. వాటి నివేదికలు అందడానికి నెలల సమయం పడుతుండటంతో చర్యల్లో జాప్యం జరుగుతోంది. నిబంధనల ప్రకారం ఆహార భద్రతా విభాగం అధికారులు ప్రతినెలా సర్వెలెన్స్‌లో భాగంగా ఆహార నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు, పురపాలక సంఘాల పారిశుధ్య విభాగం, ప్రజారోగ్య విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తనిఖీలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే తనిఖీలకు వెళుతున్నారనే ఆరోపణలున్నాయి. సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లోని పలు పెద్ద హోటళ్లలో ఆహార భద్రతా విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించగా వంటశాలల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. మరోవైపు పలు హోటళ్లు, రెస్టారెంట్లలో పగటిపూట వండిన చికెన్, బిర్యానీతోపాటు ఇతర మాంసాహార వంటకాలు మిగిలితే వాటిని ఫ్రిజ్‌లో భద్రపరిచి మరుసటి రోజు మళ్లీ వేడి చేసి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే వినియోగదారులకు పంపుతున్నారనే ఆరోపణలున్నాయి. ఆహారాన్ని పదేపదే వేడి చేయడం వల్ల జీర్ణకోశ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చికెన్ బిర్యానీ, ఇతర మాంసాహార వంటకాల్లో కృత్రిమ రంగులను అధికంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

నశాముక్త మెదక్ దిశగా సమష్టిగా కదలాలి

- నశాముక్త భారత్—టీబీ ముక్త భారత్‌కు ప్రజా భాగస్వామ్యం కీలకం
- 'జీవితానికి అవును.. నషాకు నో' అన్నదే మన నినాదం
- డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ పోలీసులకు దేశంలో తొలి ట్రోఫీ రావడం అభినందనీయం
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ప్రజానావ, మెదక్ : సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ తమలో తాము మార్పు తీసుకురావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ, ఎలాంటి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, నషాకు అలవాటు పడబోమని ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ ఐడీఓసీలో నిర్వహించిన నశాముక్త భారత్ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని, నశాముక్తి ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని నశాముక్తంగా మార్చేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత యువ దేశాల్లో ఒకటని, యువశక్తి నషా బారిన పడితే దేశ అభివృద్ధికి తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. "జీవితానికి అవును.. నషాకు నో" అన్న సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. నశాముక్త భారత్‌తో పాటు టీబీ ముక్త భారత్ లక్ష్య సాధనకు కూడా సమష్టిగా కృషి చేయాలని గవర్నర్ అన్నారు. టీబీ పూర్తిగా నయం చేయగల వ్యాధేనని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే టీబీ నుంచి పూర్తిగా కోలుకోవచ్చని చెప్పారు. నశాముక్తి, టీబీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇంటి నుంచే ఉద్యమం ప్రారంభం కావాలి

నశాముక్తి ఉద్యమం ఇంటి నుంచే ప్రారంభం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కుటుంబం నుంచి పాఠశాల, గ్రామం, మండలం, జిల్లా స్థాయికి అవగాహన విస్తరించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎవరైనా నషాకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తిస్తే మౌనంగా ఉండకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. నశాముక్తి ఒక్కరి బాధ్యత కాదని, "ఇది మనందరి బాధ్యత" అని స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే మెదక్‌ను నశాముక్త జిల్లాగా తీర్చిదిద్దగలమన్నారు.

తెలంగాణ పోలీసులకు అభినందనలు

డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించి సమర్థవంతమైన చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినందుకు తెలంగాణ పోలీసులకు దేశంలోనే తొలి ట్రోఫీ లభించడం గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీసులకు గవర్నర్ అభినందనలు తెలిపారు. జూన్ మాసంలో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో వేలాది మంది విద్యార్థుల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ఇతరులు నశాముక్తి సంకల్పం చేసిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు. ఆ సంకల్పాన్ని ఒక కార్యక్రమానికే పరిమితం చేయకుండా ప్రతి పాఠశాల, గ్రామం, కుటుంబానికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాయకత్వంలో నశాముక్తి సంకల్పాన్ని మెదక్ జిల్లా ప్రజా సంకల్పంగా మార్చాలని అన్నారు. ఎక్కడైనా నషాకు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే పోలీసు, పౌర పరిపాలన సమన్వయంతో తక్షణమే సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రూపొందించే కార్యాచరణకు అనుగుణంగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నశాముక్త మెదక్.. టీబీ ముక్త మెదక్.. ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, శక్తిమంతమైన సమాజం లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే రోహిత్ రావులు మాట్లాడుతూ నషా ముక్త్ మెదక్, నషా ముక్త్ తెలంగాణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని చెప్పారు. అంతకుముందు నషా ముక్త్ భారత్ సెల్ఫీ పాయింట్ వద్ద గవర్నర్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్యే రోహిత్ రావు కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం మహిళా శక్తి స్టాల్‌లను సందర్శించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ ఘన స్వాగతం

నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మెదక్ ఐడీఓసీకి చేరుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్యే రోహిత్ రావు,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవి శ్రీనివాస రావు లు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆ వెంటనే పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐడీఓసీ వద్ద పాత్రికేయుల సమావేశంలో గవర్నర్ మాట్లాడారు. 2029 వరకు తెలంగాణ రాష్ట్రం మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం లా తెలంగాణలో ప్రతి ఇంటికి చైతన్యవంతం చేసేందుకు మీడియా సహకరించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మత్తు పదార్థాలు లేని భారతదేశంగా 2029 వరకు చేయాల్సిన సంకల్పంతో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమ ప్రచారంలో దేశంలో మొదటి స్థానంలో నిలిచినందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అభినందించారు. అలాగే ప్రతి నెల ఒక పాఠశాలలో యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలియచేయాలన్నారు భారతదేశ విచ్ఛిన్నకర శక్తులు యువతను పెడదారిలో పెట్టేందుకు మత్తు పదార్థాలకు బానిసలుగా చేసేందుకు కృషి చేస్తున్నారని ఆరోపించారు మత్తు పదార్థాలు సేవించిన విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి ఆదిలోనే మత్తు పదార్థాల దూరంగా ఉంచేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు. హైదరాబాద్‌లో జూన్ నెలలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల సమక్షంలో 15 వేల మంది విద్యార్థులతో మత్తు పదార్థాలు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.

పేద ప్రజలకు వరంగా నిలిచే పథకాలు కొనసాగించాలి

మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్

ప్రజానావ, సికింద్రాబాద్ : గత ప్రభుత్వం నిరుపేదలకు వరంగా నిలిచేలా కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం దానిని నీరుగారిస్తే తీవ్రంగా స్పందిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పద్మారావు గౌడ్ మంగళవారం సీతాఫలమండీ లోని ఎం. ఎల్. ఏ. క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెళ్ళి కూ చేయడం సామాన్యులకు భారంగా మారిన దశలో కే. సీ. ఆర్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు ఊరటను కల్పించిందని తెలిపారు. ప్రజలకు ఉపకరించే పథకాలను అమలు చేయాలని, చెక్కుల మంజూరులో జాప్యం తగదని పద్మారావు గౌడ్ సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు తమ అవసరాలకు సీతాఫలమండీ లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మీ, రాసురి సునీత, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణా బాధ్యతే

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- 43 కిలోమీటర్ల మేర 30-35 వేల జీడిమామిడి మొక్కల పెంపకం

ప్రజానావ, మెదక్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. పచ్చద నం పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. రైతులకు అదనపు ఆదాయం అందించే ఉద్యాన పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రామాయంపేట–సిద్దిపేట మధ్య జాతీయ రహదారి 765డీజీ వెంట జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జీడిమామిడి మొక్కను నాటారు. సుమారు 43 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ కార్యక్రమంలో 30 నుంచి 35 వేల మొక్కలు నాటే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయి. జీడిమామిడి మొక్కలను ఎంపిక చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ మార్గాన్ని కల్పించే అవకాశం ఉంటుందని గవర్నర్ అన్నారు. మొక్క నాటడంతో బాధ్యత పూర్తికాదని, కుటుంబ సభ్యుడిలా భావించి ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం, మొక్కల ఎదుగుదల ను పర్యవేక్షించడం ద్వారా కార్యక్రమం లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ, రైతుల సంక్షేమం రెండింటినీ సమన్వయం చేసుకుం టూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని సూచించా రు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని గవర్నర్ పేర్కొన్నారు. క్యాన్సర్, మధుమేహం వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చైతన్యం కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి వైద్య సేవలు అందుబాటు లోకి తీసుకురావడానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చేస్తున్న కృషిని అభినందించారు. ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ రామాయంపేట–సిద్దిపేట మధ్య గతంలో రహదారికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో చెట్లు ఉండేవని, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించడం తో పచ్చదనం తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలో రహదారి వెంట జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే భవిష్యత్‌లో ప్రకృతి వైపరీత్యాల ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, మల్క కొమురయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

పద్మాలయ అంబేద్కర్‌నగర్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై వాటర్ వర్క్స్ అధికారుల పరిశీలన

ప్రజానావ, హైదరాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఫిల్మ్‌నగర్ డివిజన్ పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. బస్తీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని వెంటనే ప్రారంభించి పూర్తి చేసేలా అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వాటర్ వర్క్స్ విభాగం అధికారులు మంగళవారం పద్మాలయ బస్తీలో పర్యటించారు. బస్తీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి అధికారులు పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన తాగునీటి పైప్‌లైన్లు, అసంపూర్తిగా ఉన్న నీటి సరఫరా పైప్‌లైన్లు, డ్రైనేజీ లైన్లను పరిశీలించారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, హరిబాబు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నిరసన

ప్రజానావ, ఎల్లారెడ్డి: ఓటు హక్కు పరిరక్షణ, పారదర్శకమైన ఓటర్ల జాబితా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు నల్లరంగు చొక్కాలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని ఆయన అన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పిస్తూ, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై అడుగడుగునా ప్రమాదం

- 33 నెలల్లో 469 ప్రమాదాలు
- 216 మంది మృతి
- 355 మందికి గాయాలు
- నివారణ చర్యలు కరవు

ప్రజానావ, నల్లగొండ: జిల్లాలోని నార్కట్‌పల్లి–అద్దంకి రాష్ట్ర రహదారిపై వాహనాల రాకపోకలకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. రహదారి నిర్మాణ పనులు పూర్తయి 14 ఏళ్లు దాటినా నేటికీ కొన్ని ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో సమస్యలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో పాదచారులకు నడకదారులు లేకపోవడం, ఉన్నచోట సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం, రహదారిపైనే వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మలుపుల వద్ద చెట్లు పెరిగిపోవడం, తగిన లైటింగ్ సౌకర్యం లేకపోవడం, జీబ్రా గీతలు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో వాహనదారుల అవసరాలకు అనుగుణంగా యూటర్నులు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు అపసవ్య దిశలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. గడిచిన 33 నెలల్లో ఈ రహదారిపై ఏకంగా 469 ప్రమాదాలు చోటుచేసుకోగా 216 మంది మృత్యువాత పడ్డారు. మరో 355 మంది క్షతగాత్రులయ్యారు. ఈ లెక్కన సగటున నెలకు ఏడుగురు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ప్రమాదాల నివారణకు అవసర మైన చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చెర్వుగట్టు, చర్లపల్లి, మర్రిగూడ బైపాస్, ఆర్జాలబావి, ఇందిరమ్మ జంక్షన్, లెప్రసీ కాలనీ, దుప్పలపల్లి, తిప్పర్తి బైపాస్, కుక్కడం, వేములపల్లి, శెట్టిపాలెం రోడ్డు, మిర్యాలగూడ బైపాస్, ఈదులగూడ, కొర్లపాడు, దామచర్ల, బొత్తలపాలెం తదితర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు సరైన చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో రోజుకు రెండు నుంచి మూడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రమాదాల్లో మృతి చెందినవారు, క్షతగాత్రులుగా మారి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనలు మాత్రమే అధికారిక లెక్కల్లోకి వస్తుండటంతో వాస్తవ ప్రమాదాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికైనా రహదారిపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి లైటింగ్, జీబ్రా గీతలు, పాదచారుల నడకదారులు, అవసరమైన యూటర్నులు ఏర్పాటు చేయడంతోపాటు మలుపుల వద్ద పెరిగిన చెట్లను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్‌నినోతో విద్యుత్ డిమాండ్‌కు రెక్కలు

- రాష్ట్రంలో 8 వేల మెగావాట్ల అదనపు ఒత్తిడి
- హైదల్ ప్రాజెక్టుల్లో నీటి కొరత

ప్రజానావ, సూర్యాపేట: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల పరిధిలోని పులిచింతల తెలంగాణ జల విద్యుత్ కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన.. రాష్ట్రంలోని జల విద్యుత్ ప్రాజెక్టుల విద్యుత్ ఉత్పత్తిపై సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జల విద్యుత్ ప్రాజెక్టులు విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నప్పటికి, ప్రాజెక్టుల్లో తగినంత నీరు అందుబాటులో లేకపోవడంతో అవసరమైన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నామని తెలిపారు. ఇప్పటికే ఉన్న 4 వేల మెగావాట్ల లోటుకు అదనంగా మరో 4 వేల మెగావాట్ల డిమాండ్ పెరగడంతో విద్యుత్ సంస్థలపై మొత్తం 8 వేల మెగావాట్ల ఒత్తిడి ఏర్పడుతోందన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సాధ్యమైనంత వరకు తాగు నీటి అవసరాలకే వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారని పేర్కొన్నారు.

ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి

- వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవాలి

ప్రజానావ, నాగర్‌కర్నూల్: వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు గ్రామాల్లో వీబీజీ రామ్‌జీ పథకం కింద ఉపాధి కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఏపీవోలు, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎక్కువ పని రోజులు కల్పించి ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. గ్రామాల వారీగా పనులను గుర్తించి వాటిని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మామిడి రైతులు జాగ్రత్తలు పాటించాలి

- పూత, పిందె దశలో పురుగుమందుల పిచికారీకి దూరంగా ఉండాలి

ప్రజానావ, నాగర్‌కర్నూల్: మామిడి తోటలను సాగు చేస్తున్న రైతులు సరైన రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని కేవీకే శాస్త్రవేత్త డా. షీలా తెలిపారు. మండలంలోని పల్కపల్లిలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. మామిడి పూత, పిందె దశలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సమయంలో ఎలాంటి కీటకనాశక, తెగుళ్ల నివారణ మందులను పిచికారీ చేయకూడదని సూచించారు. ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.5.33 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

సుజాతనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రజానావ, సుజాతనగర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లోని 20, 21, 23 డివిజన్లలో రూ.5.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో రూ.10 కోట్ల వ్యయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సుజాతనగర్‌లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు, పార్కులతోపాటు 37 రకాల అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. డివిజన్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమాల్లో నగర మేయర్ మూడ్ గణేశ్, డిప్యూటీ మేయర్ లలిత, కార్పొరేటర్లు అనిత, శ్రావణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శుభకార్యం నుంచి తిరిగొస్తూ విషాదం

ఆర్టీసీ బస్సు ఢీకొని అన్నాచెల్లెళ్ల దుర్మరణం

ప్రజానావ, నార్సింగి: బంధువులతో సరదాగా గడిపి, శుభకార్యంలో పాల్గొని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లికి చెందిన వరసకు అన్నాచెల్లెళ్లైన మామిండ్ల చంద్రయ్య (65), పోచవ్వ సోమవారం ఉదయం బైక్‌పై చిన్నశంకరంపేటలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. సాయంత్రం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. చిన్నశంకరంపేట నుంచి చేగుంట మీదుగా మాచిన్‌పల్లికి వెళ్లాల్సి ఉండగా దారితప్పి 44వ జాతీయ రహదారిపై రామాయంపేట వైపు వెళ్తుండగా కాస్లాపూర్ జంక్షన్ వద్ద ప్రమాదం జరిగింది. జేబీఎస్ నుంచి నిజామాబాద్‌కు అతివేగంగా వెళ్తున్న నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రయ్య, పోచవ్వ అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్నబియ్యం ధరలకు రెక్కలు

- మూడు నెలల్లో కిలోకు రూ.15–30 పెంపు
- అక్రమ నిల్వలు, రేషన్ బియ్యం రీసైక్లింగ్ ప్రభావం?

ప్రజానావ, నల్లగొండ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతానికిపైగా ప్రజలు వినియోగించే సన్నబియ్యం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. మూడు నెలల క్రితం ఉన్న ధరలతో పోలిస్తే రకాన్ని బట్టి కిలో బియ్యంపై రూ.15 నుంచి రూ.30 వరకు ధర పెరిగింది. పంటల సాగుపై ఎల్‌నినో ప్రభావం పడటంతో దిగుబడులు తగ్గుతున్నాయని, అందువల్లే బియ్యం ధరలు పెరుగుతున్నాయని మిల్లర్లు, వ్యాపారులు చెబుతున్నారు. అయితే వర్షాభావ పరిస్థితుల ప్రభావం బియ్యం ధరలపై పడేందుకు ఇంకా సమయం ఉందని వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న ధరల పెరుగుదల మిల్లర్లు, వ్యాపారులు ఆడుతున్న వ్యాపార గేమ్‌లో భాగమేనన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గత కోతల సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసిన కొందరు మిల్లర్లు, అదే ధాన్యంతో తయారైన బియ్యాన్ని ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు రేషన్ బియ్యం అక్రమాలు కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, ఉమ్మడి జిల్లాలో సుమారు 35.28 లక్షల మంది లబ్ధిదారులకు ఈ బియ్యం అందుతోంది. అయితే వీరిలో చాలామంది బియ్యాన్ని వినియోగించకుండా అక్రమార్కులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.15 చెల్లించి కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు, ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కొత్త బస్తాల్లో నింపి వివిధ బ్రాండ్ల పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని కిలోకు రూ.70 వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మిర్యాలగూడ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్న 22 టన్నుల బియ్యాన్ని పోలీసులు ఇటీవల పట్టుకోవడం ఈ అక్రమ దందాకు అద్దం పడుతోంది. మరోవైపు మిల్లర్లు, వ్యాపారులు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించడం, రేషన్ బియ్యం అక్రమాలపై పూర్తిస్థాయిలో అడ్డుకట్ట లేకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణాలుగా చెబుతున్నారు. కొందరు వ్యాపారులు కేవలం మిల్లింగ్ అనుమతులు మాత్రమే తీసుకుని, వాటి పరిధికి మించి బియ్యం నిల్వలు కూడా చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సన్నబియ్యం ధరలు సామాన్యులపై అదనపు భారం మోపుతున్నాయి. ధరల పెరుగుదల వెనుక అసలు కారణాలను అధికారులు గుర్తించి, అక్రమ నిల్వలు, రేషన్ బియ్యం రీసైక్లింగ్, అనధికార నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వినియోగదారులు కోరుతున్నారు.

పేదరికాన్ని ఎదురీది.. వైద్య సీటు సాధించి

- టైలరింగ్ చేస్తూ కొడుకును చదివించిన తల్లి
- ఏటా రూ.1.50 లక్షల ఖర్చుకు దాతల సాయం కోరుతున్న కుటుంబం

ప్రజానావ, మహబూబ్‌నగర్: తల దాచుకునేందుకు సొంత గూడు లేదు.. కడుపు నింపుకొనేందుకు కూడు లేదు.. ఆలనాపాలన చూసే తండ్రి లేడు.. అయినా పేదరికానికి ఎదురొడ్డి చదువులో రాణించిన ఓ యువకుడు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. తల్లి రాత్రింబవళ్లు టైలరింగ్ చేస్తూ పైసాపైసా కూడబెట్టి చదివించడంతో డాక్టర్ కావాలన్న ఆమె కలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాడు మహబూబ్‌నగర్ మండలం అల్లీపూర్‌కు చెందిన సందీప్‌గౌడ్. అల్లీపూర్‌కు చెందిన స్వరూపకు ఇద్దరు కుమారులు. పిల్లలు చిన్న వయసులోనే వారి తండ్రి వారిని వదిలి వెళ్లిపోవడంతో కుటుంబ బాధ్యత అంతా ఆమెపైనే పడింది. సొంతంగా ఇల్లు కూడా లేకపోవడంతో పొట్టకూటి కోసం ఇద్దరు కుమారులను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిన స్వరూప అక్కడ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించడంతోపాటు పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివించింది. పెద్ద కుమారుడైన సందీప్‌గౌడ్ బోరబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి పదో తరగతిలో 10/10 గ్రేడ్లు సాధించాడు. అనంతరం మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బైపీసీ చదివి ఇంటర్‌లో 960 మార్కులు సాధించాడు. వైద్య విద్యలో చేరాలనే లక్ష్యంతో నీట్‌కు హాజరై తొలుత 530 మార్కులు సాధించినా ఆ పరీక్ష రద్దు కావడంతో తిరిగి నిర్వహించిన పరీక్షలో 440 మార్కులు పొందాడు. ఈ ఫలితాలతో కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి డాక్టర్ కావాలన్న తన కలకు చేరువయ్యాడు. అయితే ఆర్థిక పరిస్థితి ఇప్పుడు అతడి చదువుకు అడ్డంకిగా మారింది. కళాశాల ప్రవేశ రుసుం, హాస్టల్ ఫీజు, పుస్తకాలు తదితర ఖర్చులకు ఏటా సుమారు రూ.1.50 లక్షల వరకు అవసరమవుతుందని, టైలరింగ్ ద్వారా వచ్చే ఆదాయంతో అంత మొత్తాన్ని భరించే స్తోమత తమకు లేదని తల్లి స్వరూప ఆవేదన వ్యక్తం చేస్తోంది. పేదరికాన్ని అధిగమించి ప్రతిభతో వైద్య సీటు సాధించిన తన కుమారుడి చదువు మధ్యలో ఆగిపోకుండా దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని ఆమె వేడుకుంటోంది.

వివాహిత మృతి

- భర్తే కారణమంటూ బంధువుల ఆందోళన
- భువనగిరి ప్రభుత్వాసుపత్రి ఎదుట బైఠాయింపు
- న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

ప్రజానావ, భువనగిరి: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందగా, ఆమె మృతికి భర్తే కారణమంటూ మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. భువనగిరి నేరవిభాగం పరిధిలోని బీబీనగర్‌కు చెందిన పర్షం మణికంఠ, మౌనిక (30) దంపతులు. మౌనిక మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతికి భర్త మణికంఠే కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. మౌనిక మృతికి న్యాయం చేయాలని, ఆమె మృతికి కారణమైన మణికంఠను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న భువనగిరి డీఎస్పీ రవీందర్ పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి ఫిర్యాదును స్వీకరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వారికి వివరించారు. దీంతో ఆసుపత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు 1,317 మెట్రిక్ టన్నుల యూరియా

- మూడు జిల్లాలకు కేటాయింపు
- మార్క్‌ఫెడ్, ఎరువుల దుకాణాలకు తరలింపు

ప్రజానావ, చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే ర్యాక్ పాయింట్‌కు 1,317 మెట్రిక్ టన్నుల యూరియా మంగళవారం చేరినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాకు 517 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 500 మెట్రిక్ టన్నులు, మహబూబాబాద్ జిల్లాకు 200 మెట్రిక్ టన్నులు, ఖమ్మం సీఆర్‌పీకి 100 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు వెల్లడించారు. కేటాయించిన యూరియాను మూడు జిల్లాల్లోని మార్క్‌ఫెడ్ కేంద్రాలు, ఎరువుల దుకాణాలకు లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

అప్పుల బాధతో విషం తాగించిన తండ్రి

- 18 రోజుల తర్వాత కుమారుడూ మృతి
- భర్త, కుమార్తెను కోల్పోయిన తల్లి

ప్రజానావ, నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురం గ్రామంలో జరిగిన విషం తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన పుసులూరి శ్రీనివాస రావు అప్పుల బాధతో గత నెల 16న తన కుమార్తె లాస్య, కుమారుడు నిఖిల్‌కు శీతల పానీయంలో గడ్డిమందు కలిపి తాగించి, తానూ తాగినట్లు సమాచారం. ఈ ఘటనలో శ్రీనివాసరావు, లాస్య అదే రోజు మృతిచెందగా, నిఖిల్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తొలుత ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినప్పటికీ 18 రోజులుగా చికిత్స పొందుతున్న నిఖిల్ ఆరోగ్యం విషమించింది. దీంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. అయినప్పటికీ ఆదివారం నిఖిల్ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు నిఖిల్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు.

రోడ్లు, తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ పాదయాత్ర

- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ప్రజానావ, సంగారెడ్డి: జిల్లాలోని నాగల్‌గిద్ద మండలంలో రోడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారం కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కారముంగి నుంచి క్రాస్‌గుత్తి గ్రామం వరకు కొనసాగిన పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో అధ్వానంగా మారిన రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్య కూడా వెంటాడుతోందని ఆయన అన్నారు. వెంటనే రోడ్లను మరమ్మతు చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. గ్రామాల్లోని ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని భూపాల్‌రెడ్డి తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఒకరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..
ఆసుపత్రికి తరలింపు

ప్రజానావ, వనపర్తి: వనపర్తి మండల పరిధిలోని కిష్టగిరి గ్రామ సమీపంలో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అసైన్డ్ భూమిలో అక్రమ మట్టి దందా

- రాత్రింబవళ్లు గుట్ట తవ్వకాలు
- రోజుకు 150 ట్రక్కుల వరకు తరలింపు

ప్రజానావ, కొణిజర్ల: ఊరి సమీపంలోని అసైన్డ్ భూమిలో అందంగా కనిపించే గుట్ట అక్రమ మట్టి తవ్వకాలతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎలాంటి అనుమతులు లేకుండానే నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు, తరలింపులు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొక్లెయిన్లతో రాత్రింబవళ్లు గుట్టను తవ్వి, ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండదండలు ఉండటంతోనే అక్రమ వ్యాపారం అడ్డూ అదుపు లేకుండా సాగుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొణిజర్ల మండలం పెద్దగోపతి రెవెన్యూ పరిధిలో 40 ఎకరాలకు పైగా అసైన్డ్ భూమి ఉంది. ఈ భూమి మొత్తం గుట్టగా ఉండటంతో అక్రమార్కుల కన్ను పడిందని స్థానికులు చెబుతున్నారు. రెండు రోజులుగా గుట్టలో మట్టి తవ్వకాలు చేపట్టి కొణిజర్ల, చింతకాని మండలాల్లోని వివిధ గ్రామాలకు తరలిస్తున్నట్లు సమాచారం. రోజుకు 100 నుంచి 150 ట్రక్కుల వరకు మట్టిని తరలిస్తూ ఒక్కో ట్రక్కుకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ మట్టి తరలింపుపై అధికారులు తనిఖీలకు వస్తున్న సమాచారం వ్యాపారులకు ముందుగానే చేరుతోందని, దీంతో అధికారులు అక్కడికి చేరుకునేలోపే యంత్రాలు, వాహనాలను తొలగించి అంతా సర్దేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనంతరం అక్కడ ఏమీ కనిపించకపోవడంతో అధికారులు వెనుదిరుగుతున్నారని చెబుతున్నారు. సోమవారం కూడా ఇదే పరిస్థితి ఎదురైందని స్థానికులు పేర్కొంటున్నారు. సుమారు నెల కిందట కూడా మట్టి తరలింపుపై ఆరోపణలు రావడంతో కొద్దిరోజుల పాటు తవ్వకాలను నిలిపివేసి, తాజాగా మళ్లీ ప్రారంభించినట్లు తెలుస్తోంది. అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు, తరలింపులకు మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బూట్లు వచ్చాయి.. సగం మందికే అందాయి

- కొలతలు తీసుకోకుండానే సరఫరా
- నాణ్యతపైనా అనుమానాలు

విద్యార్థుల కొలతలు తీసుకోకుండానే బూట్లను పాఠశాల

ప్రజానావ, ఖమ్మం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి బూట్లు, సాక్స్, బెల్టులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, పంపిణీలో జాప్యం విద్యార్థులకు ఎదురుచూపులు మిగుల్చుతోంది. జిల్లాలోని సుమారు 1,200 ప్రభుత్వ పాఠశాలల్లో 65 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతుండగా, ఇప్పటి వరకు సగం మందికి మాత్రమే బూట్లు, సాక్స్, బెల్టులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగతా విద్యార్థులు వాటి కోసం ఎదురుచూస్తున్నారు. అన్ని పాఠశాలలకు ఒకేసారి సరఫరా చేయకుండా దశలవారీగా పంపిణీ చేస్తుండటంతో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. మరోవైపు బూట్ల నాణ్యతపైనా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఏకరూప దుస్తుల కోసం విద్యార్థుల కొలతలు తీసుకున్నట్లుగానే బూట్ల పంపిణీకి ముందు పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను సేకరించి, వారి పాదాల కొలతలకు అనుగుణంగా బూట్లు సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఇందుకు భిన్నంగా లకు సరఫరా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం గ్రామీణ మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో 196 మంది విద్యార్థులు ఉండగా, కేవలం 170 మందికి మాత్రమే బూట్లు పంపిణీ చేశారు. మరో పాఠశాలకు చిన్నారుల కొలతలకు సరిపోయే బూట్లు రావడంతో విద్యార్థులకు సైజు సరిపోక వాటిని మండల అధికారులకు తిరిగి పంపినట్లు తెలిసింది. దీంతో మిగతా విద్యార్థులకు బూట్లు అందలేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, వారి కొలతలకు అనుగుణంగా కాకుండా బూట్లను పంపిణీ చేయడం గందరగోళానికి దారితీస్తోంది. ఇదిలా ఉండగా, బూట్ల నాణ్యత కూడా అంతంతమాత్రంగానే ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం నగరంలోని ఓ ఉన్నత పాఠశాలకు సరఫరా చేసిన బూట్లు అందిన రోజే కుట్లు ఊడిపోయినట్లు సమాచారం. దీంతో వాటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇప్పటికీ సగం మంది విద్యార్థులు బూట్లు, ఇతర సామగ్రి కోసం ఎదురుచూస్తుండగా, హైదరాబాద్‌కు చెందిన ఓ గుత్తేదారు వీటిని సరఫరా చేసినట్లు సమాచారం. విద్యార్థుల సంఖ్య, కొలతలకు అనుగుణంగా నాణ్యమైన బూట్లను అందరికీ త్వరితగతిన పంపిణీ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఆంజనేయులు మృతి బాధాకరం

ప్రజానావ, దేవరకొండ: దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన పిరాటి ఆంజనేయులు మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం గొట్టిముక్కల గ్రామంలో ఆంజనేయులు మృతదేహాన్ని సందర్శించిన ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మాజీ సర్పంచ్ అయ్యన్న, ఎరుకలి యాదయ్య, చందు నాయక్, పర్వతాలు, పున్నూర్తి లింగం, భాధ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

- బైక్‌పై వెళ్తుండగా వెనక నుంచి ఢీకొన్న బస్సు
- ఘటనాస్థలంలోనే శంకర్ దుర్మరణం

ప్రజానావ, కామారెడ్డి: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నస్రుల్లాబాద్ మండల పరిధిలోని కంశెట్టిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. హాజీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తండాకు చెందిన కాట్రోత్ శంకర్ (50) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సంగెం గ్రామానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని నస్రుల్లాబాద్‌కు తిరిగి వస్తుండగా కంశెట్టిపల్లి వద్ద నిజామాబాద్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆయన బైక్‌ను వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

తాగునీటికి కీలకమైన చెరువు నీటి తరలింపుపై ఉద్రిక్తత

- పంట పొలాలకు నీరు విడుదలకు రైతుల యత్నం
- అడ్డుకున్న మాదన్నపేట, నాగుర్లపల్లి గ్రామస్థులు

ప్రజానావ, వరంగల్ (నర్సంపేట): వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాదన్నపేట పెద్ద చెరువు నుంచి నీటిని తరలించే ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చెరువు నుంచి కుమ్మరిగడ్డ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు మంగళవారం రైతులు తూము తెరిచేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న మాదన్న పేట, నాగుర్లపల్లి గ్రామస్థులు అక్కడికి చేరుకుని రైతులను అడ్డుకోవ డంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం చెరువులో కేవలం నాలుగు అడుగుల నీరు మాత్రమే ఉందని, ఈ నీరు తమ రెండు గ్రామాల తాగునీటి అవసరాలకు అత్యంత కీలకమని స్థానికులు తెలిపారు. చెరువు నీటిని తరలిస్తే రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల నీటిని విడుదల చేయవద్దని రైతులను కోరారు. అయినప్పటికీ రైతులు నీటిని పంట పొలాలకు తరలించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో తూము షట్టర్ తాళాన్ని స్థానికులు తీసుకెళ్లారు. దీంతో రైతులు ఎమ్మెల్యేను, నీటిపారుదల శాఖ అధికారులను కలిసి సమస్యను వివరించేందుకు వెళ్లారు.

న్యాయవాది రమేష్‌పై దాడి కేసులో కౌంటర్ కేసుపై ఎస్పీకి వినతి

ప్రజానావ, సిరిసిల్ల : బార్ అసోసియేషన్ సభ్యుడు బోదాసు రమేష్‌పై దాడి ఘటనలో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకో వడంతో పాటు, ఆయనపై నమోదైన కౌంటర్ కేసులో వాస్తవాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ సిరిసిల్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. అధ్యక్షు డు ఆపునూరి రమాకాంత్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎస్పీని కలిసి ఘటన వివరాలను వివరించారు. కౌంటర్ కేసుపై ఉన్నతాధికారులతో విచారణ జరిపిస్తామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో బుధవారం నుంచి న్యాయవాదులు విధులకు హాజరు కావాలని రమాకాంత్‌రావు కోరారు.

రామప్పకు సింగరేణి మైనింగ్‌తో ముప్పు అవాస్తవం

- సమగ్ర శాస్త్రీయ అధ్యయనం తర్వాతే మైనింగ్‌పై ముందుకు
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

ప్రజానావ, పెద్దపల్లి : ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి సింగరేణి మైనింగ్‌తో ముప్పు పొంచి ఉందంటూ వస్తున్న వార్తలు కేవలం అపోహలు, అవాస్తవాలు మాత్రమేనని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటా పూర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టాలని ప్రతిపాదించిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్ర శాస్త్రీయ అధ్యయనం నిర్వహించిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు యాజమా న్యం తెలిపింది. ఈ అంశంపై భారత పురావస్తు శాఖతో పాటు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి అందించే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. బాధ్యతాయు తమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి.. తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలిగించబోదని స్పష్టం చేసింది. వారసత్వ సంపద పరిరక్షణకు సింగరేణి కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటించింది. పర్యావరణహితమైన, చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలకే సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని యాజమాన్యం స్పష్టం చేసింది.

వేధింపులను మౌనంగా భరించకండి.. ఎదురించండి

ప్రజానావ, సిరిసిల్ల: మహిళలు, బాలికలు, విద్యా ర్థినులు వేధింపులకు గురైతే మౌనంగా ఉండకుండా వెంటనే షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. గడిచిన రెండు నెలల్లో వచ్చిన ఫిర్యాదులపై 4 ఎఫ్ఐఆర్‌లు, 5 పెట్టీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆకతాయిలను గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్ నిఘా కొనసాగుతోందని, వేధింపులు ఎదురైతే 8712656425 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

కోట్ల ఖర్చు.. చుక్క నీరు నిలవని చెక్‌డ్యాంలు

- మానేరు జలాలను ఒడిసిపట్టే లక్ష్యం నీరుగారేలా నాణ్యత లేని నిర్మాణాలు
- మరమ్మతులకు నీటిపారుదల శాఖ నిర్లక్ష్యం

ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని మానేరు జలాలను ఒడిసిపట్టి, సమీప ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించా లన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. మానేరు వరద నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచడంతోపాటు రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన చెక్‌డ్యాంలు నాణ్యత లోపాలతో దెబ్బతిని కొట్టుకుపోవడం తో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా చుక్క నీరు నిలవని పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో చెక్‌డ్యాం నీటిని మోటార్ల ద్వారా పంటలకు వినియోగించుకున్న రైతులు ప్రస్తుతం సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొట్టుకుపో యిన చెక్‌డ్యాంల మరమ్మతులపై నీటిపారుదల శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో మానేరులో నీటి లభ్యత తగ్గిపోవడంతో సాగు కోసం బోర్లు నిర్మించుకోవడం రైతులకు అదనపు భారంగా మారుతోంది. నాణ్యత లోపమే.. మానేరు వరద నీటికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలను పెంచే బృహత్తర లక్ష్యంతో చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. వరద ఉధృతిని, దాని ప్రభావాన్ని సాంకేతికంగా అంచనా వేయడంలో ఇంజి నీరింగ్ శాఖ విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో ఎన్ని క్యూసెక్కుల నీటి ఉధృతిని చెక్‌డ్యాం తట్టుకోగలదనే అంశంపై సరైన అంచనాలు లేకపోవడంతో పాటు నిర్మాణ దశలో ఇసుక, కంకర, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి వినియోగంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో వరద ఉధృతికి నిర్మాణాలు దెబ్బతినడం, కూలిపోవడం, కొట్టుకుపోవడం వాటి నాణ్యతపై అనుమానాలకు తావిస్తోంది. సాగునీటికి తండ్లాట.. రెండు జిల్లాల పరిధిలో చెక్‌డ్యాంలు కొట్టుకుపో వడంతో అన్నదాతలు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చెక్‌డ్యాంలలో నిల్వ చేసిన నీటిని మోటార్ల సాయంతో పంటలకు వినియోగించుకు నేవారు. ప్రస్తుతం మానేరుపై చిన్నఓదెల, ఖమ్మంపల్లి, వల్లెంకుంట పరిధిలోని చెక్‌డ్యాంలు ధ్వంసం కావడంతో నీరు నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో సాగు కోసం రైతులు మానేరులో బోర్లు నిర్మించుకోవాల్సి వస్తోంది. ఒక్కో బోరు కోసం రూ.10 వేలకుపైగా అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొట్టుకుపో యిన చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాద నలు రూపొందించినప్పటికీ అవి ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారుతోంది. అధికారులు స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణ నాణ్యతపై సమగ్ర పరిశీలన చేపట్టి, దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మ తులు చేపట్టి మానేరు జలాలను నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భద్రకాళి నవరాత్రులకు పటిష్ఠ భద్రత

- ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్ల పరిశీలన
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీసులకు సీపీ ఆదేశం

ప్రజానావ, వరంగల్: వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం ఆలయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తరఫున చేపడుతున్న ఏర్పాట్లపై సీపీ స్వయంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలు, భక్తుల క్యూలైన్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, భద్రతా విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్‌రావు, హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

నవంబర్ 1న సిరిసిల్ల నడిబొడ్డున జానపద జాతర

- 33 జిల్లాల కళాకారులతో అంగరంగ వైభవంగా ఫోక్ ఫెస్టివల్
- ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలకు సిరిసిల్ల వేదిక ఆధిత్యం
- మీడియా సమావేశంలో పోస్టర్ల ఆవిష్కరణ, వివరాల వెల్లడి
- వేడుకలకు కళాశాల మైదానంలో స్థల పరిశీలన

ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నవంబర్ 1న జరిగే కళాకారుల జానపద జాతరను విజయవంతం చేయాలని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు పత్తిపాటి రమణాకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఫోక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి సత్తార్, తెలంగాణ పోక్ ఇండస్ట్రీ ప్రధాన సలహాదారులు దరువు అంజన్న, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిఎల్ నాందేవ్, కళాంజలి రాజేష్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కోశాధికారి గజ్వేల్ ఎర్రం వేణు కళాకారులతో కలిసి మంగళవారం టీజీఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలకు సిద్ధమవుతున్న సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థల పరిశీలన చేశారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలో నవంబర్ 1న జరిగే జానపద కళాకారుల జాతర పోస్టర్‌ను సిరిసిల్ల శాధిఖాన లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వీరు మాట్లాడుతూ నవంబరు ఒకటిన సిరిసిల్ల పట్టణంలో జరిగే తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ సభ్యుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వివిధ రకాల జానపద కళాకారులు హాజరుకావాలని అన్నారు. తెలంగాణలోని పలువురు రాష్ట్ర మంత్రులు, రాష్ట్రంలోని పలువురు ప్రముఖ కళాకారులు, టెక్నీషియన్లు, మ్యూజిక్ డైరెక్టర్ లు, నటీనటులు, డాన్సర్లుతో కలిసి ఫోక్ నైట్ నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణలో ఫోక్ ఇండస్ట్రీ సభ్యులు పాడిన జానపద పాటలు నేడు వెండి తెర సినిమా తరహాలో ఉంటున్నాయని, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీ తరహాలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీని కూడా గుర్తించి ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ పోక్ ఇండస్ట్రీలో చాలా మంది గత 30 ఏళ్లుగా జానపద కళలను నమ్ముకొని కళాకారులు జీవిస్తున్నారని, కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. గత కొంతకాలంగా తెలంగాణ పోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నవంబర్ 01 న సిరిసిల్లలో ఆవిర్భావ సభ అనంతరం తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ సభ్యులు, కళాకారులు ఎడమల శ్రీధర్ రెడ్డి, జడల రమేష్, ఆకునూరి దేవయ్య, మాట్ల తిరుపతి, శ్రీరాముల రామచంద్రం, నక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు లేక.. రైల్వేస్టేషన్‌లో దొంగల చేతివాటం

- పనుల పేరుతో సీసీ కెమెరాల తొలగింపు
- నేరాల నియంత్రణ, కేసుల ఛేదనపై ప్రభావం

ప్రజానావ, నిజామాబాద్: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల నిఘా లేకపోవడంతో నేరస్థులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన సయ్యద్ మాజిద్ అలీ, కోజాకాలనీకి చెందిన మీర్జా అక్తర్ బేగ్‌గా గుర్తించారు. ఓకా–రామేశ్వరం రైలులోకి చొరబడి చోరీ చేసిన నాలుగు ఖరీదైన సెల్‌ఫోన్లు వారి వద్ద లభించాయి. గతంలో రైల్వేస్టేషన్‌లోని నిఘా కెమెరాల ద్వారా అనుమానితులు, నేరస్థులను గుర్తించి పట్టుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో కొందరు నేరస్థులు తప్పించుకుంటున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. నిజామాబాద్ రైల్వే జంక్షన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో పనిచేసేందుకు వలస కూలీలు ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రైల్వేస్టేషన్‌లో సాధారణంగానే చోరుల బెడద ఎక్కువగా ఉంటుందని, ప్రస్తుతం నిఘా నేత్రాలు లేకపోవడంతో దొంగలు చేతివాటం చూపిస్తున్నారని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ రైల్వే జంక్షన్ పరిధి 386 కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లోని 45 రైల్వేస్టేషన్లు దీని పరిధిలోకి వస్తాయి. బాసర, ఆదిలాబాద్, కామారెడ్డిలో ఔట్‌పోస్టులు ఉన్నాయి. జంక్షన్ పరిధిలో ఎక్కడ ప్రమాదం జరిగినా, నేర సంఘటనలు చోటుచేసుకున్నా నిజామాబాద్‌లోనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు. ఇంత విస్తృత పరిధిలో నేర ఘటనలు పెరుగుతున్నప్పటికీ రైల్వే ఠాణాలో మంజూరైన పోస్టుల్లో సగం మంది సిబ్బందితోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. సుమారు 20 ఏళ్ల కిందటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 40 పోస్టులు మంజూరు చేయగా, ప్రస్తుతం పెరిగిన అవసరాలకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను అప్‌గ్రేడ్ చేయలేదు. ప్రస్తుతం సగానికి సగం పోస్టులు ఖాళీగా ఉండటంతో తనిఖీలు, నేరాల దర్యాప్తు, కేసుల ఛేదనపై ప్రభావం పడుతోంది. పనుల ప్రాంతాల్లో కెమెరాల తొలగింపు.. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 2023 ఆగస్టులో నిజామాబాద్ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు ప్రారంభించారు. ప్లాట్‌ఫాంలు, పాదచారుల వంతెనలు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్న ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను తొలగించారు. అయితే ప్రత్యామ్నాయంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడంతో ఇదే అదనుగా నేరస్థులు తప్పించుకెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని ప్రయాణి కులు చెబుతున్నారు. ఇదే సమయంలో గంజాయిని కూడా గుట్టుగా తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోయినా ఠాణా పరిధిలో పటిష్ఠ నిఘా కొనసాగిస్తున్నామని, నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ నిఘా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు

- ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు బాలమయాదేవి

ప్రజానావ, సిరిసిల్ల: అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమ యాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎస్ఐ ఆర్ డిజిటలైజేషన్ 87.68 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. ఫారం–6, 7, 8 కింద వచ్చిన 65,716 దరఖాస్తుల్లో 61,475 పరిష్కరించామని వివరిం చారు. మిగిలిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని బాలమ యాదేవి సూచించారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లోని హెల్ప్‌డెస్క్‌ను, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 121, 133 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్ఓలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే.ఎస్.బీ. కుమారి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.35 కోట్ల రహదారి పనుల్లో వెడల్పు మరిచారా?

- పాత రోడ్డుపైనే కొత్త తారు
- ఇరుకైన ప్రాంతాల్లోనూ విస్తరణకు చర్యలు లేకపోవడంపై ప్రయాణికుల అసంతృప్తి

ప్రజానావ, వరంగల్: వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారిపై దాదాపు రూ.35 కోట్ల వ్యయం తో 15 కిలోమీటర్ల మేర చేపట్టిన నూతన తారు రోడ్డు పనుల్లో రహదారి విస్తరణ అంశం ప్రశ్నార్థకంగా మారింది. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి భీమారం, హసన్‌పర్తి మండల కేంద్రం మీదుగా ఎల్లాపూర్‌లోని నూతన జాతీయ రహదారి వరకు దశలవారీగా తారు రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే గుత్తేదారు ప్రస్తుతం ఉన్న పాత రహదారిపైనే కొత్తగా తారు వేస్తున్నారని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రహదారి వెడల్పు చేయాల్సిన ప్రాంతాల్లోనూ పాత రోడ్డుపైనే తారు వేస్తుండటంతో భవిష్యత్‌లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హసన్‌పర్తి మండల కేంద్రంతోపాటు నయీంనగర్‌లోని పాత ఆర్టీవో కార్యాలయం నుంచి ఓ షాపింగ్ కాంప్లెక్స్ వరకు రహదారి ఇరుకుగా ఉంది. గతంలోనూ ఈ ప్రాంతం లో రోడ్డు పనులు చేపట్టి సగం వరకు మాత్రమే నిర్మించి వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లోనూ అదే పరిస్థితి కొనసాగుతూ రహదారిని పూర్తిస్థాయిలో వెడల్పు చేయకుండా పాత రహదారిపైనే తారు వేస్తున్నారని పేర్కొంటున్నారు. రూ.35 కోట్లతో చేపడుతున్న రహదారి పనుల్లో అవసరమైన ప్రాంతాల్లో ముందు గానే వెడల్పు చేపట్టి, ఆ తర్వాత తారు వేయాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా పనులు జరుగుతు న్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ఇరుకుగా ఉన్న ప్రాంతాలను పూర్తిస్థాయిలో గుర్తించి రహదారిని వెడల్పు చేసిన తర్వాతే తారు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించా రని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ (శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వి.టి.ఏ.డి.ఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం తదితర నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించా రు. భవిష్యత్తులో భక్తుల రద్దీకి అనుగుణంగా వసతు లు కల్పించాలని, భక్తుల విశ్వాసాలకు అనుగుణం గా పనులు చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. పనులపై సీఎం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, నిధులు మంజూరు చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

నేరస్తుల గుండెల్లో భయం పుట్టించాలి

- **మహిళలు, బాలికలపై లైంగిక దాడులను అరికట్టేందుకు కఠిన పోలీసింగ్**
- **ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచనలు**

న్యూఢిల్లీ: మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడే అసాంఘిక శక్తులను నిరోధించేందుకు ఢిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీసింగ్ వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయాన్ని నేరస్తుల్లో కలిగించేలా సమర్థవంతమైన పోలీసింగ్ ఉండాలని సూచించింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల వెలుగు చూసిన వరుస లైంగిక దాడుల ఘటనలను పరిగణనలోకి తీసుకున్న నేపథ్యం లో ఈ వ్యాఖ్యలు చేసింది. నేరాల నిరోధానికి తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు క్షేత్రస్థాయిలో పోలీసుల గస్తీని మరింత బలోపేతం చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ సందర్భంగా పోలీసులకు పలు కీలక సూచనలు చేసింది. సంఘ వ్యతిరేక శక్తుల గుండెల్లో భయం పుట్టేలా పోలీసింగ్ ఉండాలని జస్టిస్ పర్దీవాలా పేర్కొన్నారు. నేరానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నేరస్తులు నమ్మేలా పోలీసులు వ్యవహరించాలని అన్నారు. ''ఇప్పుడు ఏదైనా చేస్తే చచ్చిపోతాం'' అనే భయం వారిలో కలిగేలా చర్యలు ఉండాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనుకాడకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ''కాస్త కఠినంగా, కచ్చితంగా వ్యవహరించడానికి వెనుకాడవద్దు. ఆర్టికల్ 21 గురించి కొందరు గగ్గోలు పెట్టవచ్చు. కానీ అవసరమైన చర్యలు తీసుకోండి'' అని పోలీసులకు సూచించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 పౌరుల జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన సీనియర్ పోలీసు అధికారిని ఉద్దేశించి జస్టిస్ పర్దీవాలా మాట్లాడుతూ.. పోలీసులపై తాము ఎంతో ఆశలు పెట్టుకున్నామని, పరిస్థితులకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. లైంగిక వేధింపులు లేదా దాడులకు గురయ్యే ప్రతి బాలికను మన సోదరిగా భావించి రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టడం పోలీసులకు ఒక సవాలని పేర్కొన్నారు. తమ అంచనాలకు అనుగుణంగా పోలీసులు పనిచేయాలని, వ్యవస్థలో కొన్ని లోపాలు ఉన్నాయన్న కారణంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకునే పరిస్థితిని అనుమతించవద్దని జస్టిస్ పర్దీవాలా స్పష్టం చేశారు.

అధికారిణినంటూ ఆప్ నేతకు టోకరా

- **పెళ్లైన విషయం దాచి వివాహం**
- **నగలు, నగదుతో పరారీ.**
- **ఆరుగురిపై పోలీసుల కేసు**

చండీగఢ్: ప్రభుత్వ అధికారిణినంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతను నమ్మించి ఓ మహిళ పెళ్లి చేసుకుని, కొద్దికాలానికే ఇంట్లోని నగలు, నగదు, విలువైన వస్తువులతో పరారైన ఘటన పంజాబ్‌లో వెలుగుచూసింది. ఫతేగఢ్ సాహిబ్ జిల్లాకు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ జాయింట్ సెక్రటరీ అమరిందర్ సింగ్‌కు మన్విందర్ కౌర్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. పెళ్లి అనంతరం కొంతకాలం నమ్మకంగా ఉన్న ఆమె.. ఆ తర్వాత ఒంటిపై ఉన్న నగలతోపాటు ఇంట్లోని నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకుని పరారైనట్లు అమరిందర్ సింగ్ ఆరోపించారు. ఆమె కనిపించకుండా పోవడంతో ఆరా తీయగా పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. మన్విందర్ కౌర్ తనను తాను పంజాబ్ సివిల్ సర్వీసెస్ అధికారిణిగా పరిచయం చేసుకుని అమరిందర్‌ను నమ్మించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా తన వయసును కూడా తప్పుగా చెప్పడంతోపాటు గతంలో తనకు వివాహం కాలేదని నమ్మించినట్లు ఆరోపించారు. అయితే ఈ వ్యవహారంపై తాజాగా విచారణ జరపగా.. మన్విందర్ కౌర్‌కు గతంలోనే వివాహమై, విడాకులు కూడా తీసుకున్నట్లు వెల్లడైంది. అంతేకాకుండా ఆమెకు 18 ఏళ్ల కుమారుడు ఉన్న విషయం కూడా బయటపడింది. దీంతో అసలు విషయాలు తెలుసుకున్న అమరిందర్ సింగ్ తీవ్రంగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మన్విందర్ కౌర్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నిందితులంతా పంజాబ్‌లోని తారన్ తరన్ జిల్లాలోని సుర్‌సింగ్ గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

వాయుసేనకు కొత్త సారథి అశుతోష్ దీక్షిత్

- **29వ చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్‌గా నియామకం**
- **3,500 గంటల విమానయాన అనుభవం**

న్యూఢిల్లీ: భారత వాయు సేన నూతన చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియ మితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాయుసేన అధిపతిని చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్‌గా వ్యవ హరిస్తారు. ప్రస్తుత వాయు సేన చీఫ్ ఎయిర్ చీఫ్ మార్ష ల్ అమర్‌ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయ నుండగా.. అదే రోజు మధ్యా హ్నం అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించనున్నా రు. ఆయన 2028 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఎయిర్ మార్షల్‌గా ఉన్న దీక్షిత్ దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత వాయుసేనలో సేవలందిస్తు న్నారు. 1966లో జన్మించిన ఆయన 1986లో వాయుసేనలో చేరారు. మిరాజ్–2000, జాగ్వార్, తేజస్, హాక్, అవ్రో, కిరణ్ వంటి పలు రకాల యుద్ధ, శిక్షణ విమానాలను నడిపిన అనుభవం ఆయనకు ఉంది. ఆయా విమానాల్లో దాదాపు 3,500 గంటలపాటు ప్రయాణించిన అనుభవాన్ని దీక్షిత్ సొంతం చేసుకున్నారు. భారత వాయుసేనలో వివిధ కీలక హోదాల్లో పనిచేసిన ఆయన.. సౌత్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్ (ప్రాజెక్ట్స్), అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్ (ప్లాన్స్) వంటి బాధ్యతలు నిర్వహించారు. అక్టోబర్ 8న భారత వాయుసేన 94వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో కొత్త చీఫ్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. అశుతోష్ దీక్షిత్ భారత వాయుసేనకు 29వ చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

హార్ముజ్ జలసంధిలో నౌకపై దాడి

- **11 మంది భారతీయ సిబ్బందికి గాయాలు**
- **దాడిని ఖండించిన భారత్**

న్యూఢిల్లీ: హార్ముజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో 11 మంది భారతీయ సిబ్బంది గాయపడ్డారు. ఒమన్ తీరంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. వివరాల ప్రకారం.. హార్ముజ్ జలసంధి వద్ద ఒమన్ తీరానికి సమీపంలో పనామాకు చెందిన ఎంటీ ఆన్ పీస్ అనే వాణిజ్య నౌకపై గుర్తుతెలియని వస్తువుతో దాడి జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా.. వారిలో 17 మంది భారతీయులు. దాడిలో 12 మంది గాయపడగా, వారిలో 11 మంది భారతీయులు ఉన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న ఒమన్ అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి నౌక వద్దకు చేరుకున్నారు. గాయపడిన వారిని రక్షించి ఒమన్‌లోని ఖసాబ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. గాయపడిన భారతీయులను సకాలంలో రక్షించినందుకు ఒమన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. హార్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై వరుసగా దాడులు జరుగుతుండటంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే కాల్పుల విరమణ పాటించి ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొల్పాలని ఆకాంక్షించింది. వాణిజ్య నౌకలు, సాధారణ ప్రజలు, మౌలిక వసతులపై దాడులు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొంది. అంతర్జాతీయ జలమార్గాల్లో నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ సూచించింది. కాగా, ఈ దాడికి పాల్పడింది ఎవరు, నౌకపై ఏ వస్తువుతో దాడి జరిగింది అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

సౌదీకి పాక్, టర్కీ ప్రత్యేక దళాలు

హౌతీల దాడుల నేపథ్యంలో మక్కా సంయుక్త రక్షణ ఒప్పందం

రియాద్: యెమెన్‌లోని హౌతీ మిలిటెంట్లు సౌదీ అరేబియాపై దాడులను తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సౌదీ అరేబియాకు ప్రత్యేక బలగాలను పంపేందుకు పాకిస్థాన్, టర్కీ దేశాలు అంగీకరించాయి. ఈ మేరకు మూడు దేశాలు మక్కా సంయుక్త రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రియాద్‌లో సోమవారం జరిగిన అత్యవసర సమావేశం అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. సమావేశానికి మూడు దేశాలకు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, ఉప ప్రధాని ఇషాక్ దార్, రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పాల్గొన్నారు. సౌదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా దేశ భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు దాన్ని సమష్టిగా ఎదుర్కొంటామని మూడు దేశాలు సంయుక్తంగా ప్రకటించాయి. మూడు దేశాల మధ్య గత ఆగస్టులో కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఏ దేశంపై దాడి జరిగినా మిగిలిన దేశాలు పరస్పరం మద్దతు అందించాల్సి ఉంటుంది. నాటోలో అత్యధిక సైనిక బలగాలు కలిగిన దేశాల్లో ఒకటైన టర్కీ, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన పాకిస్థాన్, గల్ఫ్ ప్రాంతంలో కీలకమైన సౌదీ అరేబియా ఒకే రక్షణ కూటమిగా ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా ఒప్పందం ప్రకారం సౌదీ అరేబియాకు అవసరమైన దళాలను తక్షణమే పంపేందుకు పాకిస్థాన్, టర్కీ అంగీకరించాయి. యెమెన్‌లోని హౌతీ మిలిటెంట్లు ఇటీవల సౌదీపై దాడులను పెంచడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సౌదీ నగరాలు, ఇంధన కేంద్రాలు, అంతర్జాతీయ నౌకాయాన మార్గాలను హౌతీలు లక్ష్యంగా చేసుకుంటున్న నేపథ్యంలో వాటి నుంచి రక్షణ కల్పించేందుకు పాక్, టర్కీ దళాలను రంగంలోకి దించనున్నట్లు సమాచారం.

సౌదీపై హౌతీల విరుచుకుపాటు

గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాపై హౌతీల దాడులు కొనసాగుతున్నాయి. సౌదీలోని కీలక స్థావరాలపై సోమవారం దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించగా.. ఆ వివరాలను హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరీ మంగళవారం వెల్లడించారు. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం, రబిగ్‌లోని అరాంకో రిఫైనరీపై దాడులు చేసినట్లు ఆయన తెలిపారు. డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దక్షిణ సౌదీ అరేబియాలోని కొన్ని చిన్న విమానాశ్రయాలపైనా దాడులు చేసినట్లు వెల్లడించారు. హౌతీలు యెమెన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న సాయుధ సంస్థ కాగా.. యెమెన్ సైన్యానికి వ్యతిరేకంగా ఏర్పడిన ఈ బృందానికి ఇరాన్ నిధులు, ఆయుధాలు సమకూరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇరాన్ మద్దతుతోనే హౌతీలు సౌదీ అరేబియాపై దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం. హౌతీల దాడుల నేపథ్యంలో రియాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. అయితే దాడులు ఎక్కడ జరిగాయి, ఎంతమేర ఆస్తి నష్టం జరిగింది, ప్రాణనష్టం లేదా గాయపడిన వారి వివరాలపై సౌదీ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు హౌతీలు సౌదీపై దాడులు చేస్తుండగా.. సౌదీ నేతృత్వంలోని కూటమి దళాలు యెమెన్‌లోని హౌతీల స్థావరాలపై ప్రతిదాడులు కొనసాగిస్తున్నాయి. హోదెదా ప్రస్తుతం హౌతీల ఆధీనంలో ఉంది. యెమెన్ ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతుగా నిలుస్తుండగా.. హౌతీలకు ఇరాన్ మద్దతు ఇస్తుండటంతో ఇరుదేశాల మధ్య పరోక్ష పోరు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, హౌతీల ఆధీనంలోని సనా పట్టణంపై వెయ్యికిపైగా దాడులు చేసినట్లు యెమెన్ ప్రభుత్వం ప్రకటించింది.

నిద్రపోతే రూ.12 లక్షల బహుమతి

- **జపాన్‌లో వినూత్న పోటీ**
- **90 నిమిషాలు గాఢంగా నిద్రించిన మహిళ విజేత**

టోక్యో: నిత్యం పనిలో నిమగ్నమై తీవ్ర అలసటకు గురయ్యే జపాన్‌లో నిద్రకు సంబంధించిన వినూత్న పోటీ అందరి దృష్టిని ఆకర్షించింది. గాఢంగా నిద్రపోవడమే ఈ పోటీలో ప్రధాన టాస్క్ కాగా.. విజేతకు రెండు మిలియన్ యెన్లకుపైగా, భారత కరెన్సీలో సుమారు రూ.12 లక్షల బహుమతి అందించారు. టోక్యోలో 'మ్యాట్ రేస్' పేరుతో పరుపుల తయారీ సంస్థ నిర్వహించిన ఈ పోటీలో తమను తాము 'పోటీ నిద్రగాళ్లు'గా పిలుచుకునే దజన్ల మంది పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో తక్కువ వెలుతురు, సౌకర్యవంతమైన పరుపులపై పోటీదారులు 90 నిమిషాలపాటు నిద్రించారు. ప్రతి ఒక్కరి తలకు నిద్రను పర్యవేక్షించే పరికరాలను అమర్చి.. ఎవరు ఎంత వేగంగా నిద్రలోకి జారుకున్నారు, ఎంత గాఢంగా నిద్రపోయారు అనే అంశాలను పరిశీలించి విజేతను ఎంపిక చేశారు. పోటీలో పాల్గొన్న కొందరు తమకు ఇష్టమైన టెడ్డీబేర్లను పక్కన పెట్టుకుని మరీ నిద్రించడం ఆసక్తిని రేకెత్తించింది. జపాన్ ప్రజలు తీవ్రమైన నిద్రలేమితో బాధపడుతున్న నేపథ్యంలో వారిలో నిద్రపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహక సంస్థ 'కోలా స్లీప్ జపాన్' సృజనాత్మక విభాగం డైరెక్టర్ రిచిరో నకమా తెలిపారు. జపాన్ ప్రజలు అధికంగా పనిచేస్తారని, నిద్రను ఇలా ఒక పోటీగా మార్చడం ద్వారా అందరూ కలిసి నిద్రపై ఆసక్తి పెంచుకునేలా చేయవచ్చని ఆయన వివరించారు. ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ 2021 గణాంకాల ప్రకారం జపనీయులు రోజుకు సగటున 7 గంటల 24 నిమిషాలు మాత్రమే నిద్రపోతున్నారు. సంస్థ సభ్య దేశాల్లో ఇదే అత్యల్ప సగటు నిద్ర సమయంగా నమోదైంది. ఎక్కువ పని గంటలు, సుదూర ప్రయాణాలు జపాన్‌లో నిద్ర సమయం తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు. పోటీలో పాల్గొన్న 32 ఏళ్ల చిసాటో హోండా మాట్లాడుతూ.. సమయం చాలా వేగంగా గడిచిపోయిందని, ఇంకాస్త ఎక్కువసేపు నిద్రపోతే బాగుండేదని అనిపించిందని, ఇది ఎంతో సంతోషకరమైన పోటీగా అనిపించిందని తన అనుభవాన్ని పంచుకున్నారు. కాగా, ఈ వినూత్న నిద్ర పోటీలో 'సుయిమీ' అనే మహిళ విజేతగా నిలిచారు. బహుమతిగా లభించిన డబ్బుతో ప్రత్యేకంగా ఓ ఇల్లు తీసుకుంటానని, యువరాణి పడకను పోలిన విలాసవంతమైన మంచాన్ని కొనుగోలు చేస్తానని ఆమె ఆనందంగా తెలిపారు.

అమెరికాలో మళ్లీ మీజిల్స్ కలకలం

- **3,869 కేసులు నమోదు**
- **పెన్సిల్వేనియాలో వెయ్యికి పైగా కేసులు**

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో మీజిల్స్ వ్యాధి మరోసారి విజృంభిస్తోంది. ఇటీవలి కాలంలో పెన్సిల్వేనియా రాష్ట్రంలోనే 1,000కుపైగా మీజిల్స్ కేసులు నమోదవడంతో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇతర రాష్ట్రాల్లోనూ పెద్ద సంఖ్యలో కేసులు వెలుగుచూస్తుండటంతో అమెరికా ఆందోళన చెందుతోంది. పెన్సిల్వేనియాకు పొరుగున ఉన్న న్యూయార్క్ ప్రభుత్వం కూడా పరిస్థితిని తీవ్రంగా పరిగణించి డిజాస్టర్ ఎమర్జెన్సీ ప్రకటించింది. 1990 తర్వాత అమెరికాలో ఈ స్థాయిలో మీజిల్స్ వ్యాప్తి చెందడం ఇదే తొలిసారి. అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3,869 మీజిల్స్ కేసులు నమోదయ్యాయి. 1990–91 తర్వాత ఈ స్థాయిలో కేసులు నమోదవడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఫిలడెల్ఫియాలో తొలిసారిగా మీజిల్స్ వ్యాప్తి గుర్తించగా.. అక్కడ ఇప్పటివరకు 200 మంది కిపైగా ఈ వ్యాధి బారినపడ్డారు. వీరిలో ఎక్కువ మంది మీజిల్స్ టీకా తీసుకోని వారేనని అధికారులు చెబుతున్నారు. పెన్సిల్వేనియాలో ఇప్పటివరకు 1,000 మందికిపైగా వ్యాధి బారినపడ్డారు. దీంతో అప్రమత్తమైన న్యూయార్క్ ప్రభుత్వం ఈ నెల మొత్తం డిజాస్టర్ ఎమర్జెన్సీ ప్రకటించి, మీజిల్స్ నివారణ, గుర్తింపు, అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేసింది. న్యూయార్క్ నగరానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా 100కుపైగా కేసులు నమోదైన నేపథ్యంలో పెద్ద ఎత్తున టీకాల కార్యక్రమాన్ని చేపడుతోంది. టెక్సాస్, సౌత్ కరోలినా, ఉతా తదితర రాష్ట్రాల్లోనూ మీజిల్స్ కేసులు నమోదవుతున్నాయి. ఈ వ్యాధి సోకిన వారికి సాధారణంగా జ్వరం, దగ్గు, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా చిన్నారులు ఈ వ్యాధికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉండటంతో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మీజిల్స్ నుంచి రక్షణ పొందేందుకు టీకా తీసుకోవడం అత్యంత కీలకమని అధికారులు చెబుతున్నారు.

ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు సిద్ధమైన ఇజ్రాయెల్

- **స్పందన లేకపోవడంతో ఫైటర్ జెట్ల మోహరింపు**
- **తుది నిర్ణయం ప్రధాని చేతుల్లోనే**

జెరుసలేం: ఫ్లైదుబాయ్ 1073 విమానంలో భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌పై ఒమన్‌కు చెందిన కోపైలట్ దాడి చేసిన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 170 మందికిపైగా ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆ విమానం అకస్మాత్తుగా దారి మళ్లడంతో.. దానిని కూల్చివేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు సీబీఎస్ న్యూస్ కథనం వెల్లడించింది. దుబాయ్ నుంచి విమానం బయలుదేరిన అనంతరం మార్గం మార్చుకోవడంతోపాటు కాక్‌పిట్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇజ్రాయెల్ వైమానిక దళం అప్రమత్తమైందని పేర్కొంది. విమానం సౌదీ అరేబియాలో దిగడానికి ముందే ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లను మోహరించినట్లు తెలిపింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ అధికారులు తక్షణమే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, కమాండ్ సెంటర్‌ను సిద్ధం చేసినట్లు సీబీఎస్ న్యూస్ నివేదికలో పేర్కొంది. అంతేకాక ఇజ్రాయెల్ వైమానిక క్షేత్రాన్ని మూసివేసి, యుద్ధ విమానాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించింది. ఒకవేళ ఫ్లైదుబాయ్ విమానం ఇజ్రాయెల్ వైమానిక పరిధికి చేరువైతే.. జోర్డాన్‌లోని వైమానిక క్షేత్రం నుంచి తమ యుద్ధ విమానాలను పంపించి పరిస్థితిని అంచనా వేసేందుకు సిద్ధమైనట్లు ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి. కాక్‌పిట్‌తో దృశ్య సంబంధం ఏర్పరచుకునేంత దగ్గరకు ఐఏఎఫ్ పైలట్లు చేరుకుని, విమానంలో ఏం జరుగుతోందన్నది పరిశీలించేవారని పేర్కొన్నాయి. విమానం హైజాక్‌కు గురైందని, అందులో ఉన్న ఉగ్రవాదులు ఎలాంటి స్పందన ఇవ్వడం లేదని నిర్ధారణ అయితే.. యుద్ధ విమానాల ద్వారా పరిస్థితిని తనిఖీ చేసిన అనంతరం ఐఏఎఫ్ కమిటీకి సమాచారాన్ని అందించేదని తెలిపాయి. ఆ తర్వాత ఈ సమాచారాన్ని రక్షణ మంత్రి, ప్రధానమంత్రికి చేరవేసే వారని పేర్కొన్నాయి. అయితే విమానాన్ని కూల్చివేయాలా లేదా అన్న తుది నిర్ణయం మాత్రం ప్రధానమంత్రిదేనని సీబీఎస్ న్యూస్ కథనం వెల్లడించింది. ఫ్లైదుబాయ్ విమానం బెన్ గురియాన్ విమానాశ్రయం, అజ్రేలీ సెంటర్ వంటి కీలక ప్రాంతాలను లేదా మరో అత్యంత ప్రాధాన్యమైన లక్ష్యాన్ని ఢీకొట్టే ప్రమాదం కంటే.. ముందుగానే దానిని కూల్చివేయడమే మెరుగైన నిర్ణయంగా భావించినట్లు ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, విమాన కాక్‌పిట్‌లో భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్‌పై ఒమనీ కోపైలట్ దాడి చేసిన సమయంలో ఆయన అత్యవసర సహాయం కోసం 'మేడే' కాల్ ఇచ్చారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరుచుకోవడంతో విమానంలోని ప్రయాణికులు కోపైలట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌లో విమానాన్ని కూల్చాలన్న ఉద్దేశంతోనే ఒమనీ కోపైలట్ వ్యవహరించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు నివేదిక పేర్కొంది. దాడిలో గాయపడిన పైలట్ స్మిత్ మచ్చర్ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రతీకారంతోనే ఫ్లైదుబాయ్ విమానం కూల్చే యత్నం

ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్లాల్సిన ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు కోపైలట్ అల్ హమ్మామి చేసిన ప్రయత్నం వెనుక కారణాలు విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే విమానాన్ని కూల్చాలని నిర్ణయించుకున్నట్లు అల్ హమ్మామి యూఏఈ అధికారుల విచారణలో వెల్లడించినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. విమానాన్ని కూల్చడంతోపాటు తాను కూడా ప్రాణాలు కోల్పోయి అమరుడిగా మారాలని భావించినట్లు అతడు చెప్పినట్లు సమాచారం. గత వారం దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు అల్ హమ్మామి ప్రయత్నించగా.. భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ అతడిని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఇతర పైలట్లు జోక్యం చేసుకుని విమానాన్ని సురక్షితంగా సౌదీ అరేబియాలో ల్యాండ్ చేశారు. విమానాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిన కోపైలట్ అల్ హమ్మామి ప్రస్తుతం యూఏఈ అధికారుల అదుపులో ఉన్నాడు. ఈ ఘటనపై యూఏఈ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తుండగా.. ఇజ్రాయెల్‌కు చెందిన విచారణ అధికారులు కూడా ఇందులో భాగస్వాములయ్యారు. విమానాన్ని ఎందుకు కూల్చాలని హమ్మామి భావించాడు.. ఈ కుట్ర వెనుక ఎవరైనా ఉన్నారా.. మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో అధికారులు ఆరా తీస్తున్నారు. యూఏఈ అధికారులతో కలిసి ఇజ్రాయెల్ అధికారులు నిర్వహిస్తున్న విచారణలో హమ్మామి వెల్లడించిన వివరాలను ఇజ్రాయెల్ మీడియా వెల్లడించింది. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా, ఆ దేశంపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ పౌరులు ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించినట్లు హమ్మామి విచారణలో తెలిపినట్లు పేర్కొంది. అయితే ఈ కుట్ర వెనుక మరెవరైనా ఉన్నారా, హమ్మామి చర్యకు సంబంధించి ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం.

తండ్రిని బ్యాట్‌తో కొట్టి చంపిన 17 ఏళ్ల బాలిక

ప్రజానావ, ముంబై: నాగ్‌పూర్‌లో 17 ఏళ్ల బాలిక తన తండ్రిని చెక్క బ్యాట్‌తో కొట్టి చంపిన ఘటన కలకలం రేపింది. ఎంఐడీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని 45 ఏళ్ల జైపాల్ బరేల్ళోల్పిత్నేగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. మద్యం మత్తులో ఇంటికి వచ్చిన జైపాల్, కుమార్తెతో గొడవపడి ఆమెపై దాడికి యత్నించినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బాలిక ఇంట్లోని చెక్క బ్యాట్‌తో తండ్రి తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు వేధింపులు తాళలేక తండ్రి ఆత్మహత్య

ప్రజానావ, ముంబై: ముంబైలోని వసాయ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కొడుకు, అతని స్నేహితుడి వేధింపులు తాళలేక 84 ఏళ్ల గాబ్రియేల్ డొమినిక్ క్యుటినో నయగావ్ వద్ద కదులుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు కుమార్తెకు బ

జపాన్ ఓపెన్ మళ్లీ అల్కరాజ్‌దే!

- గాయం నుంచి కోలుకున్న తర్వాత రెండో టోర్నీలోనే టైటిల్
- లెహెచ్కాపై 7–6, 6–4తో విజయం
- ఈ ఏడాది మూడో టైటిల్ సాధించిన స్పెయిన్ టెన్నిస్ స్టార్



టోక్యో: గాయం కారణంగా నాలుగున్నర నెలలు ఆటకు దూరమైన స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ తిరిగి టైటిల్ సాధించాడు. జపాన్ ఓపెన్ ఫైనల్లో మంగళవారం చెక్ రిపబ్లిక్ ఆటగాడు జిరి లెహెచ్కాను 7–6 (4), 6–4తో ఓడించి వరుసగా రెండోసారి టైటిల్ కైవసం చేసుకున్నాడు. కుడి మణికట్టు గాయం నుంచి ఆగస్టు చివర్లో కోలుకున్న అల్కరాజ్‌కు ఇది పునరాగమనం తర్వాత రెండో టోర్నీలోనే లభించిన టైటిల్ కావడం విశేషం. ప్రపంచ మూడో ర్యాంకర్ అల్కరాజ్ తొలి గేమ్‌లోనే సర్వీస్ కోల్పోయినా 3–3తో పుంజుకున్నాడు. టైబ్రేకర్‌లో 2–4తో వెనుకబడినప్పటికీ వరుసగా ఐదు పాయింట్లు గెలిచి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో కీలక సమయంలో లెహెచ్కా సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్కరాజ్.. తన సర్వీస్‌లో ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించాడు.

27వ కెరీర్ టైటిల్

ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఏడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన అల్కరాజ్.. ఫిబ్రవరిలో దోహాలో గెలిచిన తర్వాత మరో టైటిల్ కోసం ఎదురుచూశాడు. జపాన్ ఓపెన్ విజయంతో ఈ సీజన్‌లో మూడో టైటిల్‌ను, కెరీర్‌లో 27వ ట్రోఫీని ఖాతాలో వేసుకున్నాడు. గాయం నుంచి తిరిగొచ్చిన తర్వాత యూఎస్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్ వరకు చేరినా బెన్ షెల్టన్ చేతిలో ఓడిపోయాడు. అప్పటి నుంచి కుడి చేతికి కంప్రెషన్ స్లీవ్ ధరిస్తూ

నా బాధ్యత పూర్తయింది!

- కెప్టెన్సీకి హర్మన్‌ప్రీత్ కౌర్ గుడ్‌బై
- మూడు ఫార్మాట్ల సారథ్యానికి వీడ్కోలు
- కొత్త కెప్టెన్‌గా స్మృతి మంధానకు అవకాశాలు
- త్వరలో బీసీసీఐ అధికారిక ప్రకటన

న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మూడు ఫార్మాట్ల సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంది. 'కెప్టెన్‌గా నా బాధ్యతను నిర్వర్తించాను. ఇప్పుడు మళ్లీ ఆటను ప్రేమతో ఆస్వాదించేందుకు సిద్ధంగా ఉన్నా' అంటూ 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ మంగళవారం ప్రకటించింది. అయితే, అన్ని ఫార్మాట్లలో భారత జట్టుకు ఆటగాడిగా కొనసాగనుంది. గువాహటిలో జరిగిన బీసీసీఐ సమీక్ష సమావేశం అనంతరం హర్మన్‌ప్రీత్ ఈ నిర్ణయం తీసుకుంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో హర్మన్‌ప్రీత్‌తో పాటు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ప్రధాన కోచ్ అమోల్ ముజుమ్దార్ పాల్గొన్నారు. అన్ని ఫార్మాట్లలో నాయకత్వ మార్పు కోరుకుంటున్న బీసీసీఐ.. తదుపరి కెప్టెన్‌గా మంధానను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. హర్మన్‌ప్రీత్ 2016లో టీ20 జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి దాదాపు దశాబ్దం పాటు సారథ్యం వహించింది. 2022లో వన్డే కెప్టెన్‌గా, 2023లో మూడు ఫార్మాట్ల కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టింది. మొత్తంగా ఐదు టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20ల్లో భారత్‌కు నాయకత్వం వహించింది.

ప్రపంచకప్ విజయం.. ఆసియా క్రీడల్లో స్వర్ణం

హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో భారత మహిళల జట్టు గత ఏడాది తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలిచింది. ఇటీవల ఆసియా క్రీడల్లో వరుసగా రెండోసారి టీ20 స్వర్ణ పతకం సాధించింది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ రజత పతకం సాధించడంలోనూ ఆమె నాయకత్వం కీలకంగా నిలిచింది. దీంతో ప్రపంచకప్ గెలిపించిన ఏకైక భారత మహిళా కెప్టెన్‌గా ఆమె నిలిచింది. ఇటీవల టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్‌కు చేరుకోలేకపోవడం, ముఖ్యంగా టీ20ల్లో హర్మన్‌ప్రీత్ బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఆమె నాయకత్వంపై విమర్శలు పెరిగాయి. మాజీ క్రికెటర్ డయానా ఎడుల్జీ సహా పలువురు స్మృతి మంధానకు నాయకత్వం అప్పగించాలని సూచించారు.

జట్టు కోసం వ్యక్తిగత లక్ష్యాలు పక్కనపెట్టా

కెప్టెన్సీ సమయంలో జట్టు కోసం తన వ్యక్తిగత ప్రదర్శన, ఎదుగుదల, ఆశయాలను చాలాసార్లు పక్కన పెట్టా. 'రక్తం, చెమట, సమయం, త్యాగం.. అన్నీ జట్టు కోసం ఇచ్చా. కెప్టెన్సీ ముగిసినా భారత క్రికెట్‌పై నా ప్రేమ ఎప్పటికీ తగ్గదు. ఇప్పుడు ఆటను ప్రేమతో ఆడేందుకు సిద్ధంగా ఉన్నా. కెప్టెన్సీ ముగిసింది.. ప్రయాణం కొనసాగుతుంది. ఎన్నో ఎత్తుపల్లాలు చూశా. ఓటములు, విమర్శలు, నిరాశలతో పాటు విజయాలు, సంబరాలు, దేశానికి ప్రాతినిధ్యం వహించిన గర్వాన్ని కూడా అనుభవించా. ఇప్పుడు భావోద్వేగంతో పాటు ప్రశాంతమైన మనసుతో కెప్టెన్సీని వీడుతున్నా. జట్టు మంచి స్థితిలో ఉంది. ప్రతిభ, వ్యక్తిత్వం, నమ్మకం, ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఈ జట్టులో ఆటగాడిగా కొనసాగడం ఆనందంగా ఉంది.

– హర్మన్‌ప్రీత్

దాయాదుల పోరుకు ఫుల్ డిమాండ్

- ప్రపంచకప్‌లో భారత్–పాక్ మ్యాచ్ టికెట్ల కోసం లక్ష దాటిన దరఖాస్తులు
- మిగతా అన్ని మ్యాచ్‌లకు 48 గంటల్లో 10 లక్షల అభ్యర్థనలు

దుబాయ్: క్రికెట్‌లో చిరకాల ప్రత్యర్థులైన భారత్, పాకిస్థాన్ మధ్య పోరుకు ఉన్న క్రేజ్ మరోసారి వెల్లడైంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరిగే వన్డే ప్రపంచకప్‌లో అక్టోబర్ 10న జరగనున్న భారత్–పాక్ మ్యాచ్ టికెట్ల కోసం లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయి. అక్టోబర్ 1న టికెట్ లాటరీ కోసం నమోదు ప్రక్రియ ప్రారంభించిన 48 గంటల్లోనే ప్రపంచకప్‌లోని వివిధ మ్యాచ్‌లకు కలిపి 10 లక్షలకు పైగా అభ్యర్థనలు రావడం విశేషం. ఈ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం వెల్లడించింది. ప్రపంచకప్ టికెట్ల కోసం ఇప్పటివరకు 3.20 లక్షల మందికిపైగా అభిమానులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. భారత్ ఆడే మ్యాచ్‌లకు కూడా భారీ స్పందన లభిస్తోంది. భారత్–దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 86 వేలకు పైగా, భారత్–ఆస్ట్రేలియా పోరుకు 80 వేలకు పైగా టికెట్ అభ్యర్థనలు వచ్చాయి. నవంబర్ 7న జరగనున్న సూపర్–7 దశలోని భారత్–పాక్ మ్యాచ్‌కు ఇప్పటికే 75 వేల అభ్యర్థనలు నమోదయ్యాయి. టికెట్లకు అత్యధిక డిమాండ్ ఉన్న మ్యాచ్‌ల్లో ఇది నాలుగో స్థానంలో నిలిచింది.

ఫైనల్‌కూ భారీ గిరాకీ

ప్రపంచకప్ ఫైనల్‌పైనా అభిమానులు ఆసక్తి చూపుతున్నారు. జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో జరగనున్న ఫైనల్ టికెట్ల కోసం ఇప్పటివరకు దాదాపు 65 వేల అభ్యర్థనలు వచ్చాయి. 14 జట్లతో సాగే ఈ ప్రపంచకప్‌లో టికెట్ ధరలను 9.62 అమెరికా డాలర్ల (158 ర్యాండ్లు) నుంచి 31.31 డాలర్ల (514 ర్యాండ్లు) వరకు నిర్ణయించారు. కుటుంబాలు, విద్యార్థులు, పెన్షనర్లు, స్థానిక అభిమానులు, కమ్యూనిటీ క్లబ్‌లు, పాఠశాలల బృందాలకు ప్రత్యేక ధరలు, ప్యాకేజీలను అందిస్తున్నారు.

ఆఫ్రికాలో రెండు దశాబ్దాల తర్వాత

2027 ప్రపంచకప్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 21 వరకు జరగనుంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆఫ్రికా ఖండంలో ఐసీసీ పురుషుల ప్రపంచకప్ జరుగుతుండటంతో టోర్నీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 120కుపైగా దేశాల్లోని 250 కోట్ల మంది క్రికెట్ అభిమానులు ఈ టోర్నీపై దృష్టి సారించారని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా తెలిపారు. ప్రారంభమైన 48 గంటల్లోనే 10 లక్షలకు పైగా టికెట్ అభ్యర్థనలు రావడం ప్రపంచకప్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని పేర్కొన్నారు. టికెట్ లాటరీ కోసం నమోదు, మ్యాచ్‌ల ఎంపిక ప్రక్రియ నవంబర్ 21 వరకు కొనసాగుతుందని ఐసీసీ తెలిపింది.

2036 ఒలింపిక్స్‌కు భారత్ సహా 7 దేశాల పోటీ

- నవంబర్‌లో ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు ప్రాజెక్టుల ప్రదర్శన
- అహ్మదాబాద్ వేదికగా భారత్ బిడ్
- ఈ నెల 31 తర్వాత కొత్త దేశాలకు అవకాశం లేదు
- 2029 మధ్యలో తుది ఆతిథ్య దేశం ఎంపిక

లాసాన్: 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ సహా ఏడు దేశాలు ఆసక్తి వ్యక్తం చేశాయి. భారత్, జర్మనీ, హంగేరీ, ఖతార్, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, టర్కియే దేశాలు ప్రస్తుతం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో నిరంతర చర్చల్లో ఉన్నట్లు ఐఓసీ మంగళవారం వెల్లడించింది. ఈ దేశాలు తమ ఒలింపిక్స్ ప్రాజెక్టులను నవంబర్‌లో ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు ప్రదర్శించాల్సి ఉంటుంది. ఆతిథ్య ప్రాజెక్టులను వేదికల మాస్టర్ ప్లాన్, క్రీడాకారుల అనుభవం, నిధుల సమీకరణ వ్యూహం, ప్రభుత్వ–ప్రజల మద్దతు, క్రీడల నిర్వహణ సామర్థ్యం, ఒలింపిక్స్ అనంతరం స్థానిక సమాజాలకు కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలు తదితర అంశాల ఆధారంగా ఐఓసీ అంచనా వేయనుంది. నవంబర్‌లో జరిగే ప్రదర్శనలకు సంబంధించి కచ్చితమైన తేదీలను మాత్రం వెల్లడించలేదు. భారత్ తరపున అహ్మదాబాద్‌ను 2036 ఒలింపిక్స్ నిర్వహణ నగరంగా ఎంపిక చేశారు. ఇప్పటివరకు భారత్‌లో ఒలింపిక్స్ జరగలేదు. 2024లోనే భారత్ ఆతిథ్యం కోసం ఆసక్తి వ్యక్తం చేస్తూ ఐఓసీకి ప్రతిపాదన సమర్పించింది. ఐఓసీ అధ్యక్షురాలు కిర్స్టీ కోవెంట్రీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆతిథ్య ఎంపిక ప్రక్రియను నిలిపివేసి, సభ్య దేశాల నుంచి తాజా అభిప్రాయాలను తీసుకుని ప్రక్రియను సరళీకరించే చర్యలు చేపట్టారు. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎంపిక 2029 మధ్యలో జరగనుంది. భారత్ తరపున భారత ఒలింపిక్ సంఘం, గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో చర్చలు జరపనున్నాయి. అక్టోబర్ 31 తర్వాత 2036 కోసం కొత్త దేశాల ఆసక్తిని పరిగణనలోకి తీసుకోబోమని ఐఓసీ స్పష్టం చేసింది.

ఖర్చుల నియంత్రణపై దృష్టి

ఐఓసీ ఇటీవల ఆతిథ్య ఎంపిక ప్రక్రియలో మార్పులు చేసింది. ప్రాజెక్టుల వ్యయ నియంత్రణ, నిర్దేశిత గడువుల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయడం, ఆర్థిక హామీలు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. నవంబర్ ప్రదర్శనల అనంతరం 'స్టాటజిక్ డైలాగ్' దశ ప్రారంభమవుతుంది. తుది నిర్ణయ ప్రక్రియలో చివరి దశ 2028లో ప్రారంభం కానుంది. 2036 ఆతిథ్యాన్ని ఎంచుకునే సమయంలో క్రీడాకారుల అనుభవానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఐఓసీ అధ్యక్షురాలు కిర్స్టీ కోవెంట్రీ పేర్కొన్నారు. ఐదు ఒలింపిక్స్‌లో పాల్గొన్న తన అనుభవాన్ని ప్రస్తావిస్తూ.. ప్రతి ఆతిథ్య దేశం తన ప్రజలు, సంస్కృతి, నిర్వహణ తీరుతో ప్రత్యేకతను చాటుతుందని, అయితే ఎక్కడ ఒలింపిక్స్ జరిగినా క్రీడాకారులే కేంద్రంగా ఉండాలని స్పష్టం చేశారు.

Business బిజినెస్

ఎయిర్‌పోర్టులోనే బస!

- నవీ ముంబై విమానాశ్రయంలో 80 గదుల ట్రాన్సిట్ హోటల్
- ప్రయాణికులకు విశ్రాంతి, భోజనం, పని చేసుకునే వసతి

ముంబై: నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల సౌకర్యార్థం 80 గదుల 'స్పిర్ట్ ట్రాన్సిట్ హోటల్'ను అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ మంగళవారం ప్రారంభించింది. టెర్మినల్–1లోని అరైవల్స్ స్థాయిలో రెండు అంతస్తుల్లో ఈ హోటల్‌ను ఏర్పాటు చేశారు. విమానాల మధ్య ఎక్కువ సమయం వేచి ఉండే వారు, తెల్లవారుజామున విమానాలు ఎక్కాల్సిన వారు, అర్ధరాత్రి చేరుకునే ప్రయాణికులు, స్వల్పకాలిక బస కోరుకునే వారికి ఇది ఉపయోగపడనుంది. ప్రయాణికులు నాలుగు గంటల బస లేదా రాత్రంతా ఉండే సదుపాయాన్ని ఎంచుకోవచ్చు. స్నానపు గదులు, భోజనం, ఇతర హోటల్ సేవలు అందుబాటులో ఉంటాయి. మొత్తం 80 గదులను ఆరు విభాగాలుగా ఏర్పాటు చేశారు. గదుల విస్తీర్ణం 130 చదరపు అడుగుల నుంచి 410 చదరపు అడుగుల వరకు ఉంటుంది. సుపీరియర్ సింగిల్, సుపీరియర్ డబుల్, సుపీరియర్ ట్విన్, సుపీరియర్ యాక్సెసిబుల్, జూనియర్ సూట్, ఎగ్జిక్యూటివ్ సూట్ విభాగాలు ఉన్నాయి. హోటల్‌లో 40 మంది కూర్చునే సామర్థ్యంతో 24 గంటలూ పనిచేసే రెస్టారెంట్ ఉంది. గదికే భోజనం తెప్పించుకునే సదుపాయం, తక్షణం తీసుకెళ్లే ఆహారం, బార్ కూడా అందుబాటులో ఉంటాయి. విమానాల మధ్య విశ్రాంతి తీసుకోవడం, పని చేసుకోవడం, సేదతీరడం కోసం విమానాశ్రయంలోనే వసతి కల్పించడమే స్పిర్ట్ ఉద్దేశమని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ నాన్–ఏరో బిజినెస్ సీఈఓ సుచిత్ బన్సాల్ తెలిపారు.

గువాహటిలోనూ ఏర్పాటు

ఈ సేవలను ఇతర విమానాశ్రయాలకు విస్తరించే యోచనలో భాగంగా గువాహటిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బోర్డోలోయి అంతర్జాతీయ విమానాశ్రయంలోనూ స్పిర్ట్ హోటల్‌ను ఏర్పాటు చేయనున్నారు. టెర్మినల్–2 అరైవల్స్ ప్రాంతంలోని మూడో అంతస్తులో 21 గదులతో ఈ హోటల్ రానుంది. ట్రాన్సిట్ ప్రయాణికులు, వచ్చే–వెళ్లే ప్రయాణికులు, ఎక్కువసేపు వేచి ఉండాల్సిన వారు, వ్యాపార ప్రయాణికులకు ఇది సేవలందించనుంది. ప్రత్యేక వర్క్‌స్టేషన్లు, సమావేశాలకు అనువైన ప్రదేశాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. ముంబై మహానగర ప్రాంత విమాన ప్రయాణ అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి చేసిన నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం 2025 డిసెంబర్‌లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ ఏడాది జూలై 15న అబుదాబికి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంతో అంతర్జాతీయ సర్వీసులు మొదలయ్యాయి. విమానాశ్రయాల్లో విమానయానేతర సేవలను విస్తరించడంలో భాగంగానే స్పిర్ట్ ట్రాన్సిట్ హోటల్‌ను ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది.

రెపో రేటు పెంపు తప్పదా?

- నేడు ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన ప్రకటన
- 25 బేసిస్ పాయింట్ల పెంపుపై అంచనాలు
- మూడున్నరేళ్ల తర్వాత కీలక వడ్డీరేట్ల పెంపు?

ముంబై: ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బుధవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధానాన్ని ప్రకటించనుంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో ధరల ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో దాదాపు మూడున్నరేళ్ల తర్వాత కీలక వడ్డీరేటును పెంచే అవకాశం ఉందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ద్రవ్యపరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం ముగిసిన అనంతరం ఉదయం 10 గంటలకు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. స్వల్పకాలిక రుణ రేటు అయిన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని పీటీఐ నిర్వహించిన నిపుణుల సర్వేలో మెజారిటీ అభిప్రాయపడింది. అయితే, విధాన వైఖరిలో మార్పు ఉంటుందా? అన్న అంశంపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు రేటు పెంపు తప్పదని భావిస్తుండగా.. మరికొందరు ఆర్‌బీఐ తక్షణమే పెంపు చేపట్టకపోవచ్చని పేర్కొన్నారు.

2023 తర్వాత తొలిసారి

చివరిసారిగా 2023 ఫిబ్రవరిలో ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 6.50 శాతానికి చేర్చింది. ఆ తర్వాత 2023–24లో రేటును యథాతథంగా కొనసాగించింది. 2025లో నాలుగు విడతల్లో మొత్తం 125 బేసిస్ పాయింట్ల మేర రేట్లను తగ్గించింది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. ఇప్పుడు పెంపు చేపడితే సుదీర్ఘ విరామం తర్వాత ఆర్‌బీఐ వైఖరిలో మార్పుగా నిలవనుంది. వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం పద్ధ ఉంచాలని కేంద్రం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి ఇరువైపులా 2 శాతం వరకు పరిమితిని అనుమతించింది. అయితే ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలోని 4.45 శాతం నుంచి 4.82 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై మార్కెట్లతో పాటు రుణగ్రహీతల్లోనూ ఆసక్తి నెలకొంది.

4 ఆసుపత్రుల్లో వాటాల కొనుగోలు: కిమ్స్

హైదరాబాద్: మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని 4 ఆసుపత్రుల్లో వాటాలు కొనుగోలు చేయడానికి, హైదరాబాద్‌కు చెందిన కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఆయా ఆసుపత్రుల్లో నిర్వహణ, కార్యకలాపాల భాగస్వామిగా ఉన్న కిమ్స్.. వ్యూహాత్మకంగా ఈ పెట్టుబడులు పెడుతున్నట్లు వివరించింది.

మహారాష్ట్రలోని సాంగ్లీలో ఉన్న ఉషాకాల్ అభినవ్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 6% వాటాను రూ.15 కోట్లతో కిమ్స్ కొనుగోలు చేయనుంది. ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 316 పడకలుండగా, 500కు విస్తరించే అవకాశం ఉంది. ఈనెల 31లోగా వాటా కొనుగోలు పూర్తి చేయాల్సి ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన సర్వోత్తమ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ (ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్)లో 51% వాటాను రూ.80 కోట్లతో కొనుగోలు చేయనుంది. ఈ ఆసుపత్రిలో 183 పడకల సామర్థ్యం ఉంది.

గుంటూరులోని ఇన్సిగ్నియా హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ (కిమ్స్–శిఖర)లో 51% వాటాను కిమ్స్ 12–24 నెలల్లో దశల వారీగా కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు రూ.30.35 ధర నిర్ణయించారు. ప్రస్తుతం 150 పడకలుండగా, 200కు విస్తరించొచ్చు. హైదరాబాద్ కొంపల్లిలోని స్ప్రెండిడ్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 22% వాటాను రూ.40 కోట్లతో కొనుగోలు చేయనుంది. 225కు పైగా పడకలకు విస్తరించే సామర్థ్యం ఈ ఆసుపత్రికి ఉంది. ఈ కొనుగోలు ప్రక్రియను 2027 మార్చి 31లోగా పూర్తి చేయాలన్నది కిమ్స్ లక్ష్యం.

వరుసగా రెండోరోజూ జోష్‌లో మార్కెట్లు

- 685 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్.. 22,776 వద్ద ముగిసిన నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు చేరడం, బ్యాంకింగ్ షేర్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ భారీ లాభాలతో ముగిశాయి. మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 685.34 పాయింట్లు (0.95 శాతం) పుంజుకుని 73,067.81 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 220.35 పాయింట్లు (0.98 శాతం) లాభపడి 22,776.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ట్రెంట్ అత్యధికంగా 12.78 శాతం దూసుకెళ్లింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా లాభాల్లో నిలిచాయి. మరోవైపు టెక్ మహీంద్రా, టైటన్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి.

చమురు ధరలు దిగువకు

అంతర్జాతీయ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ ధర 1.70 శాతం తగ్గి బ్యారెల్‌కు 98.59 డాలర్లకు చేరింది. ముడిచమురు ధరలు తగ్గడం వల్ల స్థూల ఆర్థిక ఒత్తిళ్లు కొంతమేర తగ్గుతాయన్న అంచనాలతో మదుపర్ల సెంటిమెంట్ బలపడిందని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ తెలిపారు. ఆసియా మార్కెట్లలో జపాన్‌కు చెందిన నిక్కీ 225, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ లాభాలతో ముగియగా.. దక్షిణ కొరియా కోస్పి నష్టాల్లో నిలిచింది. యూరప్ మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి. సోమవారం అమెరికా మార్కెట్లు కూడా లాభాల్లో ముగిశాయి.

అయితే విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం రూ.4, 699.14 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్చేంజీల గణాంకాలు వెల్లడించాయి. దేశీయ మార్కెట్లు సోమవా రం కూడా లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 472.77 పాయింట్లు (0.66 శాతం) పెరిగి 72,382.47 వద్ద, నిఫ్టీ 133.80 పాయింట్లు (0.60 శాతం) లాభంతో 22,555.75 వద్ద స్థిరపడిన విషయం తెలిసిందే.

‘కాకా’లో అనురాగ్ కశ్యప్.. పెరిగిన హైప్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కాకా’పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు చిత్రబృందం శరవేగంగా పనులు పూర్తి చేస్తోంది. ఇప్పటికే షూటింగ్‌ను వేగవంతం చేసిన మేకర్స్ వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా విడుదల చేసిన అప్‌డేట్‌తో ‘కాకా’పై హైప్ మరింత పెరిగింది. బాలీవుడ్ ప్రముఖ దర్శకనటుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో ఓ కీలకమైన, శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ‘కాకా’ ప్రపంచం ఇప్పుడు ఘోరంగా మారింది.. శక్తివంతమైన, కీలక పాత్రలో అనురాగ్ కశ్యప్ నటిస్తున్నారు’ అంటూ మేకర్స్ వెల్లడించడంతో మెగా అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది. చిరంజీవి, అనురాగ్ కశ్యప్ కాంబినేషన్ ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులు ‘ఏమైనా కాంబినేషనా కాకా.. వెయిటింగ్’ అంటూ ఫైర్ ఎమోజీలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో చిరంజీవి కదిరి కాళీదాస్ పాత్రలో కనిపించనున్నారు. అనస్వరా రాజన్, నివేతా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను, కన్నడ నటి రచిత రామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు సినిమా షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో నిర్వహిస్తూ చిత్రబృందం ఫుల్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డును సృష్టించాలనే లక్ష్యంతో ‘ది బ్లడీ బెంచ్‌మార్క్’ అనే క్యాప్షన్‌తో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ‘కాకా’ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

భాషా గందరగోళమే కామ్రేడ్ కళ్యాణ్ హైలైట్

శ్రీవిష్ణు కథా నాయకుడిగా నటించిన ‘కామ్రేడ్ కళ్యాణ్’ ఆద్యంతం వినోదాన్ని పంచే చిత్రమని నటి మహిమా నంబియార్ అన్నారు. ఈ సినిమాలో తాను ఒడియా అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, కథానాయకుడికి తన భాష అర్థం కాకపోవడంతో ఇద్దరి మధ్య చోటుచేసుకునే గందరగోళ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని తెలిపారు. సినిమా విడుదల నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మహిమా నంబియార్ పలు విషయాలను పంచుకున్నారు. ‘‘కామ్రేడ్ కళ్యాణ్‌లో నేను ఒడియా అమ్మాయి పాత్రను పోషించాను. హీరోకు నా భాష రాకపోవడంతో మా ఇద్దరి మధ్య జరిగే సంభాషణలు, అపార్థాలతో కూడిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. అవి ప్రేక్షకులను తప్పకుండా నవ్విస్తాయి. సినిమాలో ఈ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి’’ అని ఆమె చెప్పారు. ఈ చిత్రంలోని పాటలను ఒడిశాలోని కొండ ప్రాంతాలతో పాటు మరికొన్ని కఠినమైన లొకేషన్లలో చిత్రీకరించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో షూటింగ్ చేయడం తనకు కొంత సవాల్‌గా అనిపించిందని పేర్కొన్నారు. తన పేరు మార్పు గురించి కూడా మహిమ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ‘‘నా అసలు పేరు గోపిక. నేను నటించిన తొలి తమిళ సినిమా సమయంలో న్యూమరాలజీ ప్రకారం ఆ పేరు నాకు సెట్ కాదని దర్శకుడు సూచించారు. దాంతో ఆయన నా పేరును మహిమగా మార్చారు. ఆ తర్వాత నా ఇంటిపేరును కూడా జోడించుకుని మహిమా నంబియార్‌గా కొనసాగుతున్నాను’’ అని చెప్పారు. నటిగా ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం తనకు ఇష్టం లేదని, అన్ని భాషల్లోనూ విభిన్నమైన పాత్రలు, కథాంశాలను ఎంచుకోవాలనుకుంటున్నానని మహిమ తెలిపారు. మలయాళం, కన్నడ, తమిళం, తెలుగు భాషల్లో తనకు భిన్నమైన జానర్లలో నటించే అవకాశాలు వస్తున్నాయని, వాటిని ఆసక్తిగా స్వీకరిస్తున్నానని చెప్పారు. కేవలం కథానాయిక పాత్రలకే పరిమితం కావాలని తాను భావించడం లేదని, నటిగా తనను తాను సవాల్ చేసుకునే పాత్రలకు ప్రాధాన్యం ఇస్తున్నానని పేర్కొన్నారు. ప్రతినాయిక పాత్రలు, తల్లి పాత్రలు, రెండో కథానాయిక పాత్రలు ఇలా విభిన్నమైన పాత్రల్లో కనిపించేందుకు సిద్ధంగా ఉన్నానని మహిమా నంబియార్ స్పష్టం చేశారు.

సోషల్ మీడియా అకౌంట్లకు ఆధార్ లింక్ చేయాలి

సోషల్ మీడియాలో ఫొటోల మార్ఫింగ్, ట్రోలింగ్, వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో హీరో రామ్ పోతినేని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆన్‌లైన్‌లో స్పష్టమైన వ్యక్తిగత గుర్తింపు లేకపోవడం వల్లే కొందరు ఎలాంటి భయం లేకుం డా ఇతరులను దూషించడం, వేధించడం, ట్రో లింగ్‌కు పాల్పడుతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి సోషల్ మీడియా ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేసే విధానాన్ని తీసుకురావాలని సూచించారు. అలా చేస్తే యూజర్లు తమ ఖాతాల విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఖాతా వెనుక ఉన్న వ్యక్తి ఎవరో గుర్తించే అవకాశం ఉంటే ఆన్‌లైన్ అబ్యూజ్, సైబర్ బుల్లీయింగ్, ఫేక్ అకౌంట్ల సమస్యలను కొంతవరకు అరికట్టవచ్చని రామ్ తెలిపారు. స్పష్టమైన ఐడెంటిటీ లేకపోవడం వల్లే కొందరు ఇతరులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వేధించడం, ట్రోల్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, ప్రతి ఖాతాకు ఆధార్ లింక్ చేసే విధానం అమల్లోకి వస్తే యూజర్లు తమ ప్రవర్తనపై జాగ్రత్త వహిస్తారని ఆయన తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

‘రణబాలి’ ట్రైలర్‌కు రంగం సిద్ధం

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం ‘రణబాలి’పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అక్టోబర్ 16న ఈ చిత్రం గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట సరికొత్త రికార్డులు సృష్టిస్తూ సామాజిక మాధ్యమాలను షేక్ చేయగా, తాజాగా విజయ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలక అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ‘రణబాలి’ ట్రైలర్ విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. పోస్టర్‌లో విజయ్ దేవరకొండ వెనుకవైపు కత్తిని ధరించి, పిడికిలి బిగించి, చేతికి రక్తం కారుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర ఆగ్రహంతో కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఆయన ఇంటెన్స్ లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ‘ఆ జానపద గాథ ఎట్టకేలకు అక్టోబర్ 8న వెల్లడి కానుంది. శాపగ్రస్త భూమికి సంబంధించిన గాథ రాబోతుంది’ అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ట్రైలర్ అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ప్రతిభావంతుడైన దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలన, ఆ కాలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, స్వాతంత్ర్య ఉద్యమం నేపథ్యంలో ఈ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీగా రూపొందుతున్న ఈ భారీ చిత్రానికి అజయ్–అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉండగా, తాజాగా ట్రైలర్ విడుదల తేదీ ప్రకటనతో ‘రణబాలి’పై అంచనాలు మరింతగా పెరిగాయి.



ఆదర్శ కుటుంబంకు బ్రేక్

టాలీవుడ్ స్టార్ హీరో వెంకటేష్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం’ విడుదల వాయిదా పడింది. అక్టోబర్ 9న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని తొలుత భావించినప్పటికీ, చివరి నిమిషంలో విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ ప్రకటించారు. ఈ విషయాన్ని వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం వరకు కూడా సినిమాను అనుకున్న తేదీకే విడుదల చేస్తామని తాము పూర్తి నమ్మకంతో ఉన్నామని తెలిపారు. అక్టోబర్ 10 నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానుండటంతో అదే సమయంలో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశామని, అందులో భాగంగానే విదేశాల్లోనూ ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించామని చెప్పారు. అయితే సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉండటంతో పాటు, సెన్సార్ కోసం కంటెంట్ కూడా అందించలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఒకవేళ తీవ్రంగా శ్రమించి సినిమాను అనుకున్న సమయానికి తీసుకొచ్చినా, తుది ప్రతిని ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లోనే మొదటిసారి చూసే పరిస్థితి వస్తుందని, అలాంటి రిస్క్ తీసుకోవడం ఎందుకనే ఉద్దేశంతోనే విడుదలను వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల అక్టోబర్ 9న విడుదల కావాల్సిన ఇతర చిన్న సినిమాలకు ఇబ్బంది కలిగిందని, ఆయా చిత్రాల బృందాలకు క్షమాపణలు చెబుతున్నానని నాగవంశీ అన్నారు. వెంకటేష్ అభిమానులు తీవ్రంగా నిరాశ చెందారని తనకు తెలుసని, వారికి కూడా క్షమాపణలు తెలిపారు. ఏడాది పాటు ఎంతో కష్టపడి సినిమా తీసిన తర్వాత కనీసం ప్రశాంతంగా విడుదల చేసుకునే అవకాశం కూడా లేకపోతే అర్థం లేదని వ్యాఖ్యానించారు. విడుదలకు కేవలం నాలుగు రోజుల ముందు వాయిదా ప్రకటించడం సరైన నిర్ణయం కాదని తెలిసినా, ప్రస్తుత పరిస్థితుల్లో తప్పదం లేదని పేర్కొన్నారు. ఇంకా రెండు పాటల చిత్రీకరణతో పాటు ట్రైలర్ కట్ వంటి కీలక పనులు పూర్తి కావాల్సి ఉందని వెల్లడించారు. ఈ పనులన్నింటినీ పక్కాగా పూర్తి చేసి, తాము 200 శాతం సంతృప్తిగా ఉన్నప్పుడే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. వెంకటేష్ అభిమానులు కాలర్ ఎగరేసుకునేలా ఈ సినిమా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం వెంకటేష్, సురేష్‌బాబు విదేశాల్లో ఉన్నారని, వారు తిరిగి వచ్చిన తర్వాత అందరితో కలిసి చర్చించి కొత్త విడుదల తేదీని ఖరారు చేస్తామని నాగవంశీ తెలిపారు. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించి తప్పు చేశానని అంగీకరించిన ఆయన, ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

సూర్య సినిమాలో సీరియల్ కిల్లర్‌గా నస్లెన్?

‘ప్రేమలు’ చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయకుడు నస్లెన్ ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంలో కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ‘ఆవేశం’ ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో సూర్య ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా ‘సీన్’పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య కెరీర్‌లో 47వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాను దర్శకుడు అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇందులో డీఎస్పీ ప్రేమ్‌రాజ్‌గా సూర్య కనిపించిన తీరు అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచింది. ఇదిలా ఉండగా.. ఈ చిత్రంలో నస్లెన్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన పాత్రకు సంబంధించి ఓ ఆసక్తికరమైన సమాచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బాల్య జ్ఞాపకాల ‘సమ్మర్ హాలిడేస్’

చిన్ననాటి జ్ఞాపకాలు, పల్లె వాతావరణం, స్నేహం నేపథ్యంలో తెరకెక్కుతున్న అందమైన తెలుగు కుటుంబ కథా చిత్రం ‘సమ్మర్ హాలిడేస్’. శ్రీకర్ నయన్ జి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. సింజిత్ ఎర్రమిల్లి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి అప్‌డేట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా, తాజాగా చిత్రబృందం మరో ఆసక్తికరమైన ప్రకటన చేసింది. చిన్ననాటి స్నేహాన్ని ప్రతిబింబించే ‘ఫ్రెండ్‌షిప్ సాంగ్’ను రేపు సాయంత్రం 4.05 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ‘‘కొన్ని స్నేహాలు అమాయకత్వంతో మొదలై జ్ఞాపకాలుగా మారతాయి’’ అనే భావంతో రూపొందిన ఈ పాటను ‘సమ్మర్ హాలిడేస్’ నుంచి ‘కేవీ అండ్ ఆర్‌వీ గీతం’గా పరిచయం చేస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. మాస్టర్ రోహన్ రాయ్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి, జయసుధ అమ్మమ్మ పాత్రలో, రాజీవ్ కనకాల, వాసుకి ఆనంద్, హర్షవర్ధన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం కథ గోదావరి ప్రాంతంలోని పచ్చని పల్లె వాతావరణంలో సాగుతుంది. సెలవుల్లో అమ్మమ్మ ఊరికి వెళ్లే ఓ పట్టణ కుర్రాడికి అక్కడ ఓ పేపర్ బాయ్‌తో పరిచయం ఏర్పడటం, ఆ తర్వాత ఇద్దరి మధ్య చిగురించే స్నేహం, వారి బాల్యపు అల్లర్లు, ఆటపాటలు, మధురమైన జ్ఞాపకాల చుట్టూ కథ కొనసాగుతుంది. కుటుంబ అనుబంధాలు, బాల్య స్నేహం, పల్లె జీవనశైలిని ఆవిష్కరిస్తూ ఈ చిత్రం ఆహ్లాదకరమైన అనుభూతిని అందించే ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది.

సోషల్ మీడియాలో తనపై వచ్చే ట్రోలింగ్స్‌ను చూసి తన ప్రవర్తనను మార్చుకునే ప్రసక్తే లేదని నటి రష్మిక మందన్న స్పష్టం చేశారు. అందరితోనూ సరదాగా, స్నేహపూర్వకంగా ఉండటాన్ని కొంతమంది తప్పుపడుతున్నారని, అయితే తన స్వభావాన్ని మార్చుకోవాల్సిన అవసరం తనకు లేదని చెప్పారు. ‘రణబాలి’ సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను పంచుకున్నారు. ‘‘నా ఉద్దేశంలో అందరితో మంచిగా ఉండటం బలహీనత కాదు. నేను ఎక్కడ ఉంటే అక్కడ పాజిటివిటీ ఉండాలని, అందరూ సంతోషంగా ఉండాలని సరదాగా ఉంటాను. దీనికి ఎవరైనా ఏ పేరు పెట్టినా నాకు అభ్యంతరం లేదు. అందరికీ నేను నచ్చాలని లేదు. నాకు నచ్చినట్లుగా, సహజంగా ఉండటమే నాకు ఇష్టం. నేను నాలా ఉండేందుకు ఎలాంటి నటన చేయాల్సిన అవసరం లేదు. ఎవరి కోసం నా ప్రవర్తనను మార్చుకోను. నేను సరదాగా ఉండటం వల్ల నా కుటుంబం, స్నేహితులు కూడా సంతోషంగా ఉంటారు’’ అని రష్మిక తెలిపారు. ఇక ‘రణబాలి’ తనకు ఎంతో ప్రత్యేకమైన చిత్రమని ఆమె చెప్పారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో నటించాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నానని, అందుకే వచ్చిన అవకాశాన్ని వదులుకోలేదని తెలిపారు. సినిమాలో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్నారని తెలియగానే వెంటనే అంగీకరించానని చెప్పారు. ‘‘విజయ్‌తో కలిసి తెరపై కనిపించి చాలా కాలమైంది. మరోసారి ఆయనతో కలిసి నటించే అవకాశం రావడంతో ఈ సినిమా నాకు మరింత ప్రత్యేకంగా మారింది’’ అని రష్మిక పేర్కొన్నారు. ఈ చిత్రంలో తాను పోషించిన జయమ్మ పాత్ర గురించి కూడా ఆమె ఆసక్తికర విషయాలు వెల్లడించారు. జయమ్మ పాత్రలో భావోద్వేగాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, ప్రేక్షకులు ఆ పాత్రతో తప్పకుండా అనుసంధానమవుతారని రష్మిక అన్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన ‘రణబాలి’ అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ట్రోలింగ్ చూసి మారను నాకిలా ఉండటమే ఇష్టం

సంపద అవసరమైన చోట ఉపయోగపడాలి

టాలీవుడ్‌లో దశాబ్దాలుగా తనదైన హాస్యంతో ప్రేక్షకులను అలరిస్తూ తిరుగులేని క్రేజ్ సొంతం చేసుకున్న హాస్యబ్రహ్మ బ్రహ్మానందం ప్రస్తుతం వయసు పెరగడంతో సినిమాల సంఖ్యను తగ్గించారు. అయినప్పటికీ తన మాటలు, అభిప్రాయాలతో అభిమానులను అలరిస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన సంపాదన, డబ్బు విలువ, ఆర్థిక క్రమశిక్షణ, ఇతరులకు చేసే సహాయం గురించి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని సరిగ్గా వినియోగించడం కూడా అంతే ముఖ్యమని బ్రహ్మానందం అన్నారు. సినిమా పరిశ్రమలో చాలామంది ఆర్థికంగా చేసిన తప్పులను గమనించడం ద్వారా ఏం చేయకూడదో తాను నేర్చుకున్నానని తెలిపారు. డబ్బు విషయంలో తాను కచ్చితంగా వ్యవహరించడాన్ని కొందరు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని, అయితే అదే ఆర్థిక క్రమశిక్షణ కారణంగా దాదాపు 23 మంది పేద అడపిల్లల పెళ్లిళ్లు జరిపించగలిగానని వెల్లడించారు. తాను చేసే సహాయాన్ని ప్రచారం చేసుకోవడం తనకు ఏమాత్రం ఇష్టం ఉండదని, సహాయం చేశామని ఫొటోలు తీసుకుని వాటిని ప్రచారం చేసుకోవడం నచ్చదని స్పష్టం చేశారు. ‘సంపద అంటే అవసరమైన చోట ఉపయోగపడాలి’ అనే భావనతోనే తాను జీవిస్తున్నానని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో నిజమైన ధనవంతుడు ఎవరు అనే ప్రశ్నకు కూడా బ్రహ్మానందం తనదైన శైలిలో సమాధానమిచ్చారు. కోట్ల రూపాయల సంపద ఉన్నప్పటికీ ప్రశాంతంగా నిద్రపట్టకపోతే ఆ సంపద వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించిన ఆయన, రోజంతా కష్టపడి పనిచేసి ప్రశాంతంగా నిద్రపోయే వ్యక్తే తన దృష్టిలో నిజమైన కోటీశ్వరుడని అన్నారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.